(సమగ్ర తెలుగు దినపత్రిక)

# ప్రజావేదిక

PRAJA VEDICA TELUGU DAILY




తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ సంపుటి : 2 సంచిక : 48 (కాంప్లిమెంటరీ కాపీ) ఎడిటర్:వెంకన్న 17-8 - 2024 పేజీలు : 6

Digital Edition

## మళ్లీ ఎన్నికల హడావుడి

- మూడు విడతల్లో జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలు
- ఒకే విడతలో హర్యానాకు...
- షెడ్యూల్ ప్రకటించిన కేంద్ర ఎన్నికల కమిషన్




న్యూఢిల్లీ: దేశంలో మళ్లీ ఎన్నికల సందడి ప్రారంభమైంది. జమ్మూకశ్మీర్, హర్యానా అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను భారత ఎన్నికల కమిషన్ శుక్రవారం ప్రకటించింది. 90 అసెంబ్లీ స్థానాలున్న జమ్మూకశ్మీర్ అసెంబ్లీకి మూడు విడతలుగా సెప్టెంబర్ 18, 25, అక్టోబర్ 1వ తేదీల్లో ఎన్నికలు జరుగనుండగా... అక్టోబర్ 4న ఓట్ల లెక్కింపు ఉంటుంది. హర్యానా అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ అక్టోబర్ 1న నిర్వహించనున్నారు. అక్టోబర్ 4న ఫలితాలు ప్రకటిస్తారు. 90 అసెంబ్లీ స్థానాలున్న జమ్మూకశ్మీర్ అసెంబ్లీకి మూడు విడతలుగా సెప్టెంబర్ 18, 25, అక్టోబర్ 1వ తేదీల్లో ఎన్నికలు జరుగనున్నాయి. జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల (2024) షెడ్యూల్ ప్రకారం మూడు విడతల్లో పోలింగ్ జరుగనుంది. తొలి విడత పోలింగ్

- మిగతా 2 లో

## ఉత్తమ హీరో రిషబ్

- హీరోయిన్లు నిత్యమీనన్, మానసి పరేఖ్
- ఉత్తమ ప్రాంతీయ తెలుగు చిత్రం కార్తికేయ-2
- జాతీయ చలనచిత్ర పురస్కారాల ప్రకటన










న్యూఢిల్లీ: జాతీయ చలనచిత్ర పురస్కారాలను (70వ) కేంద్రం శుక్రవారం ప్రకటించింది. ఉత్తమ చిత్రం అవార్డు మలయాళ సినిమా 'ఆట్టమ్'ను వరించింది. ఉత్తమ నటుడి పురస్కారం 'కాంతార' సినిమాకుగాను రిషబ్ శెట్టికి దక్కింది. ఉత్తమ నటి పురస్కారానికి నిత్య మీనన్ (తిరుచిట్రంబళం), మానసి పరేఖ్ (కచ్ ఎక్స్‌ప్రెస్)ను జ్యూరీ సంయుక్తంగా ఎంపిక చేసింది. 2022 డిసెంబరు 31 నాటికి సెన్సార్ అయిన చిత్రాలకు ఈ

- మిగతా 2 లో

## 27న ఏపీ మంత్రివర్గ సమావేశం

అమరావతి: ఈ నెల 27వ తేదీన మంత్రి మండలి సమావేశం జరగనుంది. కాగిత రహిత కేబినెట్ సమావేశం నిర్వహించాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలో భాగంగా మంత్రులకు ఐప్యాడ్‌లు ఇవ్వాలని నిర్ణయించారు. ఇకపై క్యాబినెట్ సమావేశాలు ఎలక్ట్రానిక్ ఫార్మాట్ లోనే జరుగుతాయని సీఎం చంద్ర బాబు గత క్యాబినెట్‌లో చెప్పారు. పేపర్ రహిత సమావేశం నిర్వహిస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. సీఎం అధ్యక్షతన ఆ రోజు ఉదయం 11 గంటలకు సమావేశం జరుగుతుంది.

## పెట్టుబడులు పెట్టండి

### ఫాక్స్‌కాన్ చైర్మన్ యాంగ్ లియూ బృందంతో రేవంత్ భేటీ



హైదరాబాద్: ఫోర్త్ సిటీలో పెట్టుబడులు పెట్టాలని ఫాక్స్‌కాన్ సంస్థను సీఎం రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. అంతర్జాతీయ దిగ్గజ పారిశ్రామిక సంస్థ ఫాక్స్‌కాన్ చైర్మన్ యాంగ్ లియూ ప్రతినిధి బృందం శుక్రవారం ఉదయం దిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో అధికారిక నివాసంలో సమావేశమైంది. హైదరాబాద్‌కు ఉన్న చరిత్ర, పారిశ్రామిక సంస్థల విస్తరణకు ఉన్న అనుకూలత, వాతావరణ పరిస్థితులను సీఎం బృందానికి వివరించారు. 430 ఏళ్ల కింద పునాది రాయి పడిన హైదరాబాద్ ... కాలక్రమంలో మూడు నగరాలుగా అభివృద్ధి చెందిన తీరును తెలియజేశారు. ప్రభుత్వాలు మారినా పారిశ్రామిక అభివృద్ధిలో వైరుధ్యాలు లేకపోవడంతోనే హైదరాబాద్ వేగంగా పురోగతి చెందుతోందన్నారు. ఆ అభివృద్ధిని మరింతగా పరుగులు పెట్టించేందుకే తాము ప్రపంచ అవసరాలకు తగినట్లు ఫ్యూచర్ సిటీ పేరుతో నాలుగో నగరానికి (ఫోర్త్ సిటీ) రూపకల్పన చేస్తున్నామని ముఖ్యమంత్రి వివరించారు. ఫోర్త్ సిటీలో విద్య, వైద్యం, క్రీడా, ఎలక్ట్రానిక్స్-ఎలక్ట్రికల్, స్కిల్ డెవలప్‌మెంట్ ఇలా బహుముఖంగా అభివృద్ధి చేయనున్నామని చెప్పారు. ప్రస్తుత ప్రపంచానికి అవసరమైన స్కిల్స్‌ను యువతకు అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీని ప్రారంభిస్తున్నామన్నారు. నవ తరం పరిశ్రమల అవసరాలు, అవసరమైన నైపుణ్యాలు, భవిష్యత్తులో పరిశ్రమల అవసరాలు తీర్చే మానవ వనరులను అందించేందుకు అవసరమైన సిలబస్ రూపకల్పనలో ప్రముఖ పారిశ్రామికవేత్తలను భాగస్వాములను చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే స్కిల్ వర్సిటీకి ఆనంద్ మహేంద్రను చైర్మన్‌గా, మరో పారిశ్రామిక వేత్త శ్రీనివాస రాజును వైస్ చైర్మన్‌గా నియమించామని చెప్పారు. అంతర్జాతీయ విమానాశ్రయం, ఔటర్ రింగు రోడ్డు (ఓఆర్ఆర్), రీజినల్ రింగురోడ్డు (ఆర్ఆర్ఆర్)తో పాటు హైదరాబాద్‌కు ఉన్న అన్ని అనుకూలతలను వారికి పూసగుచ్చినట్టు చెప్పారు. ఫోర్త్ సిటీలో ఫాక్స్‌కాన్ సంస్థను నెలకొల్పేందుకు అవసరమైన అనుమతులు, మద్దతు ఇస్తామని యాంగ్ లియూకి హామీ ఇచ్చారు. పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. ఇటీవల అమెరికా, దక్షిణ కొరియాలో పర్యటించి దిగ్గజ పారిశ్రామిక సంస్థలతో జరిపిన చర్చలు, చేసుకున్న ఒప్పందాలను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు చైర్మన్ యాంగ్ లియూకు వివరించారు.

### మీ విజన్ అద్భుతం: యాంగ్ లియూ

ఫోర్త్ సిటీ రూపకల్పనలో ముఖ్యమంత్రి దార్శనికత, పారిశ్రామిక విధానాలు తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని యాంగ్ లియూ అన్నారు. ఫోర్త్ సిటీతో మీ విజన్ అద్భుతంగా ఉందంటూ రేవంత్ రెడ్డిని అభినందించారు. తాను

- మిగతా 2 లో



## వయనాడ్ బాధితులకు ఏపీ ప్రభుత్వం సాయం

అమరావతి: కేరళ వయనాడ్ వరద బాధితుల సహాయం కోసం ఏపీ ప్రభుత్వం పది కోట్ల రూపాయలు విడుదల చేసింది. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు సీఎంఆర్ఎఫ్ నుండి పది కోట్లు విడుదలకు రెవెన్యూ శాఖ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్‌పీ సిసోడియా జీవో విడుదల చేశారు. కేరళలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా వయనాడ్‌లో వందలాది మంది మృత్యువాత పడగా, వేలాది మంది నిరాశ్రయులు అయ్యారు. వరద బాధితులను ఆదుకునేందుకు పది కోట్ల ఆర్థిక సాయం ప్రకటించారు.



## పేదల దరిచేరేది ఎర్రజెండానే

### సీపీఐ వందేళ్ల చరిత్ర: కూనంనేని

హైదరాబాద్: వందేళ్ల చరిత్ర కలిగిన పార్టీ సీపీఐ అని, ఎన్నో త్యాగాలకు నిలయంగా ఉన్న ఉమ్మడి నల్గొండ జిల్లాలో బడులు, బలహీన వర్గాల కోసం ఎన్నో పోరాటాలు చేసిన ఘన చరిత్ర ఆ పార్టీకి ఉందని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గ కేంద్రంలో చెక్క వెంకటేశ్ అధ్యక్షతన శుక్రవారం నిర్మల కౌన్సిల్ సమావేశం జరిగింది. తొలుత ముఖ్య అతిథిగా విచ్చేసిన కూనంనేని జెండా ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ... పేదవాడికి ఎప్పుడు కష్టం వచ్చినా వారి వెన్నంటే ఉండి పోరాటం చేసేది కమ్యూనిస్టు పార్టీనే అని చెప్పారు. పెట్రోల్, డీజిల్, నిత్యావసర ధరలు పెరిగినా... పేదవాడి దరిచేరిది ఎర్రజెండానే అని అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో నిరుపేదలకు భూముల పంచిన చరిత్ర ఒక్క భారత కమ్యూనిస్టు పార్టీకే ఉందని పేర్కొన్నారు.

వందేళ్లు అధికారం లేకున్నా నిలబడగలిగిన పార్టీ ఏదైనా ఉంది అంటే అది ఒక కమ్యూనిస్టు పార్టీనే అన్నారు. మరింత బలోపేతం దిశగా యాదాద్రి భువనగిరి జిల్లాలో నిర్మాణపరంగా పార్టీ ఎదుగుదల కోసం తిరిగి పార్టీకి పునర్వైభవం తీసుకు వచ్చేందుకు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పల్ల వెంకట్ రెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు, జిల్లా సహాయ కార్యదర్శులు దామోదర్ రెడ్డి, బి.సత్యనారాయణ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు బండి జంగమ్మ,కృష్ణ, ఇమ్రాన్, అశోక్, సుదర్శన్, ప్రజా సంఘాల అధ్యక్ష కార్యదర్శులు మహేష్ మహేందర్, శాంతి కుమార్ జిల్లా కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.



## మూడు బ్యాంకులపై ఆర్‌బీఐ కొరడా

ముంబై: తమ ఆదేశాలు పాటించని మూడు బ్యాంకులపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కొరడా ఝుళిపించింది. ఆయా బ్యాంకులకు జరిమానా విధించింది. ఇందులో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, హిందుజా లేల్యాండ్ ఫైనాన్స్, పూనావాలా ఫిన్‌కార్ప్ ఉన్నాయి. బ్యాంక్ క్రెడిట్ కార్డుల డెలివరీ, సెక్యూరిటీ, కేవైసీ వంటి అంశాల్లో తమ ఆదేశాలు పాటించడంలో విఫలమైనందుకు బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రకు రూ.1.27 కోట్లు జరిమానా విధించింది. కేవైసీ నిబంధనలు పాటించడంలో విఫలమైనందుకు హిందుజా లేల్యాండ్ ఫైనాన్స్ లిమిటెడ్‌కు రూ.4.90 లక్షలు జరిమానా విధిస్తున్నట్లు తెలిపింది.

## నిరసన వెల్లువ

### దేశవ్యాప్తంగా వైద్యుల ఆందోళన

- భద్రత కల్పించాలంటూ ప్రదర్శనలు
- హత్యాచార దోషిని ఉరితీయాలని డిమాండ్




న్యూఢిల్లీ/ముంబై: కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ వైద్య కళాశాల ఆస్పత్రిలో ట్రయినీ వైద్యురాలిపై హత్యాచార ఘటనకు నిరసనగా దేశవ్యాప్తంగా వైద్యులు, వివిధ వైద్య సంస్థల ప్రతినిధులు ఆందోళనలు కొనసాగిస్తున్నారు. దేశ రాజధాని దిల్లీ సహా ఈ దారుణ ఘటన జరిగిన కోల్‌కతాతో పాటు ముంబై, భోపాల్, హైదరాబాద్, కేరళ, పంజాబ్, తమిళనాడులో వైద్యులు పెద్ద ఎత్తున వివిధ రూపాలలో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. పంజాబ్ రాష్ట్రంలోని అమృత్‌సర్‌లో అవుట్ పేషెంట్ విభాగాలు, శస్త్ర చికిత్సలు, వార్డులు సహా ఎంపిక చేసిన సేవలను నిలిపివేస్తున్నట్లు రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ ప్రకటించింది. ఆగస్టు 16 నుంచి ప్రారంభించి తదుపరి నోటీసు వరకు కొనసాగిస్తున్నట్లు ప్రకటించింది. అమృత్‌సర్‌లోని గురునానక్ దేవ్ ఆసుపత్రి, పంజాబ్‌లోని జలంధర్‌లోని ప్రభుత్వాస్పత్రిలలో వైద్యులు, జూనియర్ డాక్టర్లు నిరసనలు చేపట్టారు. వైద్యురాలిపై హత్యాచార ఘటనకు బాధ్యులైన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ కేరళ రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రుల్లోని జూనియర్ డాక్టర్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థులు నిరసనలు చేపట్టారు. శుక్రవారం ఉదయం కేరళ మెడికల్ పోస్ట్ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ (కేఎంపీజీఏ) అధ్వర్యంలో జూనియర్ డాక్టర్లు అన్ని ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రుల్లో ఓపీడీ, వార్డు విధులను బహిష్కరించారు. ఆసుపత్రుల వద్ద నిరసన ప్రదర్శనలు కూడా నిర్వహించారు. కేఎంపీజీఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఉన్ని ఆర్ పిళ్లై మాట్లాడుతూ 'ఆసుపత్రులలో వైద్యుల భద్రతను నిర్ధారించాలని మేము నిరసన చేస్తున్నాం. అత్యవసర సేవలను మాత్రమే అందిస్తాం. మా డిమాండ్లను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైతే మా నిరసన మరింత ఉధృతం అవుతుంది' అని తెలిపారు. తమిళనాడులోని తిరుచ్చిలో మహాత్మాగాంధీ మెమోరియల్ ప్రభుత్వాస్పత్రి వైద్యులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. తిరుచ్చి వైద్యుల సంఘానికి చెందిన డాక్టర్ అరుళీశ్వరన్ మాట్లాడుతూ మహిళా వైద్యురాలిపై హత్యాచార ఘటనను ఖండిస్తూ, వైద్య సిబ్బంది భద్రత కోసం ఈ నిరసనను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం సరైన పద్ధతిలో విచారణ జరిపి నేరస్తులను వీలైనంత త్వరగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దేశ రాజధాని దిల్లీలోని లేడీ హార్డింగ్ వైద్య కళాశాల జూనియర్ డాక్టర్లు నిరసనకు దిగారు. ప్రదర్శన సందర్భంగా వైద్యులు ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ 'మాకు న్యాయం కావాలి' అంటూ నినాదాలు చేశారు. తమ డిమాండ్లను శాంతియుతంగా ప్రభుత్వానికి అందించి బాధితురాలికి న్యాయం చేసేందుకు వైద్యులు, ప్రజలు పెద్ద సంఖ్యలో నిర్మాణ్ భవన్‌కు తరలిరావాలని ఆర్‌ఎంఎల్ ఆస్పత్రికి చెందిన డాక్టర్ ఆకాశ్ పిలుపునిచ్చారు. బెంగాల్‌లో నిరసన తెలుపుతున్న మా సహోద్యోగులకు

- మిగతా 2 లో

**బెంగాల్ ప్రభుత్వం పూర్తిగా విఫలం**

-8లో

**24 గంటల పాటు వైద్యసేవల నిలిపివేత**

-2లో

## ఇదీ లోకం!






## ఎమ్మెల్సీగా బొత్స ఏకగ్రీవం

- ధృవీకరణ పత్రం అందజేసిన రిటర్నింగ్ అధికారి
- మాజీ మంత్రికి వైసీపీ అభినందనలు

2లో

## ఒత్తిడితోనే రేవంత్ రంకెలు

### వందశాతం రుణమాఫీ నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పకుంటా: కేటీఆర్




హైదరాబాద్: ఖమ్మం జిల్లా పర్యటనలో భాగంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడినతీరు చూస్తుంటే ఆయన తీవ్ర ఒత్తిడితోనే రంకెలేశాడనే విషయం అర్థం అవుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులు దూసుకుపోతున్నారన్న బాధా లేక భట్టి విక్రమార్క ఎక్కువ తిరుగుతున్నాడని బాధా... అధిష్ఠానం పట్టించుకోవడం లేదని ఫ్రస్టేషనా అనే విషయం అర్థం కావడం లేదన్నారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ లంకెబిందెలు, న్యూక్లియర్ చైన్, దిల్‌సుఖ్ నగర్‌లో విమానం అంటాడని, ఇది చూస్తే ఆయనకు కచ్చితంగా మానసికస్థితి ఏదో అయి ఉంటదని అనుమానం వ్యక్తం చేశారు. గౌడన్నలను కల్లులో నీళ్లు ఎంత కలుపుతారో అంటాడు, ప్రైవేట్ టీచర్లు ఫెయిలయ్యే వాళ్లు అంటాడు, మహిళలను కించపరుస్తాడు, గురుకులాల భోజనం సరిగా ఉండదని దుయ్యబట్టారు. భాగ్రానంగల్, విప్రో, ఇన్ఫోసిస్ సీఈవో అని ఏదేదో మాట్లాడుతూ మానసిక సంతులిత లేకుండా ప్రవర్తిస్తున్నాడని ... రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులు దీన్ని పరిశీలించాలని సూచించారు. నువ్వు చేసిన రుణమాఫీ నిజమైతే నీ నియోజకవర్గం కొడంగల్ కు మీడియాతో వెళ్లి వంద శాతం రుణమాఫీ జరిగిందని ఒక్క రైతు చెప్పినా తాను

- మిగతా 2 లో

## నింగిలోకి ఎస్ఎస్ఎల్వీ- డి3

ప్రయోగం విజయవంతం



# ట్రంప్ ప్రచారానికి ప్రత్యేక భద్రత



**వాషింగ్టన్:** అమెరికా మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌కు భద్రత పెంచినట్లుగా అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. ఆయన బహిరంగ సభలపై సీక్రెట్ సర్వీసెస్ అధికారులు ప్రత్యేక దృష్టిసారించారు. ఫ్లోరిడా, వాషింగ్టన్‌లో ఉన్న ట్రంప్ కార్యాలయాల వద్ద కూడా సాయుధ భద్రత పెంచినట్లుగా అధికారులు పేర్కొన్నారు. భద్రతా ప్రమాణాల దృష్ట్యా అధ్యక్షుడు బైడెన్ సహా ఎన్నికల్లో అభ్యర్థులుగా పోటీ చేస్తున్నవారి భద్రతను పెంచినట్లు అధికారులు పేర్కొన్నారు. ఇటీవల జరిగిన ఓ సమావేశానికి ఆయన భారీ భద్రతతో వచ్చారు. ట్రంప్‌నకు అభిమానులు కరచాలనం ఇవ్వడానికి, సెల్ఫీలు దిగడానికి అధికారులు అనుమతించలేదు. చుట్టూ బుల్లెట్ ప్రూఫ్ గ్లాస్ వలయం ఏర్పాటు చేశారు. సెక్యూరిటీని బలోపేతం చేశారు. దీనిపై ప్రచార ప్రతినిధి స్టీవెన్ చియుంగ్‌ను మీడియా ప్రశ్నించగా...భద్రతా వ్యవహారాల వివరాలన వెల్లడించడం కుదరదన్నారు. కాగా... అమెరికాలో ఈ ఏడాది నవంబరులో అధ్యక్ష ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. రిప్లబికన్ పార్టీ అభ్యర్థిగా అధ్యక్ష రేసులో దిగిన ట్రంప్ విజయం కోసం తీవ్రంగా యత్నిస్తున్నారు. ఈ క్రమంలోనే పెన్సిల్వేనియాలోని బట్లర్‌లో ఏర్పాటుచేసిన ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లాడుతుండగా ఓ భవనంపై నక్కిన దుండగుడు కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో మాజీ అధ్యక్షుడి కుడి చెవికి గాయమైంది. భద్రతా వైఫల్యం వల్లే ఇలా జరిగిందని విమర్శలు వెలువడ్డాయి. అమెరికా అధ్యక్షులు, మాజీ అధ్యక్షులు వారి కుటుంబ సభ్యులతోపాటు అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు రక్షణ కల్పించే బాధ్యత యునైటెడ్ స్టేట్స్ సీక్రెట్ సర్వీస్‌దే అని పేర్కొన్నారు.

# హసీనాపై ఒత్తిడి వద్దన్న భారత్

## వాషింగ్టన్ పోస్టు సంచలన కథనం




**వాషింగ్టన్:** బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనాను ఒత్తిడికి గురిచేయొద్దని ఏడాది క్రితం భారత్ అధికారులు అమెరికాను కోరినట్లు వాషింగ్టన్ పోస్టు పత్రిక ప్రచు రించింది. 2024 జాతీయ ఎన్నికలకు ముందు బంగ్లాదేశ్‌లో చాలామందిని జైళ్లలో వేయడాన్ని ఉద్దేశించి అమెరికా దౌత్యవేత్తలు తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. అదే సమయంలో అమెరికా ప్రభుత్వం బంగ్లాదేశ్‌కు చెందిన ఓ పోలీస్ విభాగంపై ఆంక్షలు విధించింది. ఇది అవామీ అధినేత కింద పనిచేస్తుందనే ఆరోపణలున్నాయి. బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్యం అణచివేతకు, మానవ హక్కుల ఉల్లంఘనలకు పాల్పడేవారిపైనా ఆంక్షలు విధిస్తామని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో భారత అధికారులు వరుసగా అమెరికాతో చర్చలు జరిపారు. హసీనా విషయంలో మరీ కఠినవైఖరి అవలంబించొద్దని కోరినట్లు వాషింగ్టన్ పోస్టు పేర్కొంది. అక్కడి ప్రతిపక్షాలు బలపడితే ఆ దేశం ఇస్లామిక్ అతివాద శక్తుల కేంద్రంగా మారుతుందని న్యూఢిల్లీ ఆందోళన వ్యక్తం చేసినట్లు వెల్లడించింది. అంతిమంగా అది భారత్ జాతీయ భద్రతకు సవాళ్లను విసురుతుందని అమెరికాకు వెల్లడించింది. ఈ విషయంపై 'మీరు ప్రజాస్వామ్యం పేరిట చర్యలు చేపడతారు. అది మాకు చాలా తీవ్ర అంశంగా మారి అస్తిత్వానికి ముప్పు అవుతుంది' అని కొందరు భారతీయ అధికారులు తమ వద్ద వ్యాఖ్యానించినట్లు ఆ పత్రిక వెల్లడించింది. వ్యూహాత్మక ఏకాభిప్రాయం లేకపోతే... వ్యూహాత్మక భాగస్వామి కూడా కాలేరని భారత అధికారి పేర్కొన్నట్లు వెల్లడించింది. ఆ తర్వాత నుంచి బైడెన్ కార్యవర్గం నాటి బంగ్లా ప్రధాని హసీనా, ఆమె అధికారులపై ఆంక్షల విషయంలో కొంత మెతక వైఖరి అవలంబించినట్లు తెలిపింది. ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో పరిస్థితి దారి తప్పిందా అనే విషయంపై భారత్-అమెరికా విశ్లేషించుకొన్నట్లు వాషింగ్టన్ పోస్టు పేర్కొంది. కొన్ని విషయాల్లో అమెరికా ప్రజల అంచనాలకు భిన్నంగా ఉన్న భాగస్వాములతో కలిసి పనిచేయాల్సి ఉంటుందని ఓ అమెరికా అధికారి వ్యాఖ్యానించినట్లు వెల్లడించింది. బంగ్లాదేశ్‌లో క్షేత్రస్థాయిలో పరిస్థితులు పూర్తి భిన్నంగా ఉంటాయని పేర్కొన్నారు. బంగ్లాదేశ్‌లో ఎన్నికలకు ముందే హసీనా విషయంలో కఠిన వైఖరి అవలంబించాలని అక్కడి అమెరికా రాయబారి పీటర్‌హాస్ వంటి వారు కోరారు. ఈ ఏడాది జనవరిలో బంగ్లాదేశ్ ఎన్నికలు జరిగాయి. దీనిని ప్రధాన ప్రతిపక్షమైన బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) బహిష్కరించింది. ఆ తర్వాత ఈ ఎన్నికలను సిగ్గుమాలిన చర్యగా అభివర్ణించింది. అమెరికా విదేశాంగ శాఖ మాత్రం ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా సాగలేదని ఆరోపించింది. ఇది నాలుగోసారి ఎన్నికైన హసీనా ప్రభుత్వానికి ఇబ్బందికరంగా పరిణమించింది. కొన్ని నెలలు మౌనంగా ఉన్న హసీనా మే నెలలో ఓ సంచలన ప్రకటన చేశారు. బంగ్లాదేశ్‌లో వైమానిక స్థావరం ఏర్పాటుచేసుకోవడానికి ఒక దేశానికి అనుమతిస్తే... తన ఎన్నిక సాఫీగా జరిగేటట్లు చేస్తానని ప్రతిపాదించిందన్న అర్థంలో చెప్పారు. ఈ ప్రకటన ఒక్కసారిగా ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. అమెరికానే ఆ దేశం అయి ఉంటుందని ప్రచారం జరిగింది. తాజాగా వాషింగ్టన్ పోస్టు కథనం హసీనా సర్కార్‌కు అమెరికాకు సంబంధాలు అంత సాఫీగా లేవనే విషయాన్ని తేటతెల్లం చేసింది.

# అమెరికాను నమ్మలేం: సౌదీ యువరాజు

**రియాద్:** పలస్తీనా ఆందోళనలు పట్టించుకోకుండా ఇజ్రాయిల్‌తో సంబంధాలను సాధారణస్థితికి తీసుకొస్తే... తను హత్యకు గురయ్యే ప్రమాదం ఉందని సౌదీ యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ (ఎంబీఎస్) ఆందోళన వ్యక్తంచేశారు. ఆయన అమెరికా కాంగ్రెస్ సభ్యులతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేసినట్లు ఆంగ్లపత్రిక పొలిటికో కథనం వెలువరించింది. ఈజిప్టు ఒకప్పటి అధ్యక్షుడు అన్వర్ సాదత్ రక్షణ విషయంలో అమెరికా ఏం చేసిందని ఆయన కాంగ్రెస్ సభ్యులను ప్రశ్నించినట్లు తెలుస్తోంది. అప్పట్లో ఈజిప్ట్ కూడా ఇజ్రాయిల్‌తో సంబంధాలను సాధారణస్థితికి తెస్తూ క్యాంప్‌డేవిడ్‌లో ఒప్పందం చేసుకొన్నారు. ఇది జరిగిన తర్వాత 1981లో కొందరు ఉగ్రవాదులు అన్వర్‌ను కాల్చి చంపారు. తనకు మృత్యుభయాలు ఉన్నా... ఇజ్రాయిల్‌తో సంబంధాలు ముందుకుతీసుకెళ్లడానికి తాను సిద్ధంగా ఉన్నట్లు ఎంబీఎస్ వెల్లడించారు. అమెరికా కూడా సౌదీ అరేబియాకు చాలా ప్రతిపాదనలు చేసినట్లు తెలుస్తోంది. వీటిల్లో రక్షణ ఒప్పందం, పౌర అణు కార్యక్రమం, సాంకేతికరంగంలో పెట్టుబడులు వంటివి వీటిల్లో ఉన్నాయి. మరోవైపు ఇజ్రాయిల్ ప్రభుత్వం పలస్తీనా దేశం ఏర్పాటుకు సుముఖంగా లేకపోవడంపై సౌదీ యువరాజు ఎంబీఎస్ అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. 'పలస్తీనా విషయాన్ని మేం పట్టించుకొంటున్నాం.. పశ్చిమాసియా మొత్తం ఈ విషయాన్ని గమనిస్తోంది. నేను దానిని పట్టించుకోకపోతే... ఇస్లాంలోని పవిత్ర ప్రదేశాల రక్షకుడిగా నా స్థానం సుస్థిరం కాదు' అని ఎంబీఎస్ అమెరికా కాంగ్రెస్ వద్ద పేర్కొన్నట్లు తెలుస్తోంది. మరోవైపు సౌదీని మచ్చిక చేసుకొనేందుకు వీలుగా అమెరికా కొన్ని నిర్ణయాలు ఇటీవల ప్రకటించింది. ఆ దేశానికి ఆయుధ విక్రయాలను పునరుద్ధరించింది.

# ఒత్తిడితోనే రేవంత్ రంకెలు

(మొదటిపేజీ తరువాయి)

రాజకీయాలను వదిలేస్తానని రేవంత్‌కు కేటీఆర్ సవాల్ విసిరారు. ప్రతి నియోజకవర్గంలో ఈ పచ్చిమోసాన్ని తాము ఎండగడతామని, దమ్ముంటే నా సవాల్ ను స్వీకరించాలని ఛాలెంజ్ చేస్తున్నాని అన్నారు. సగం కూడా రుణమాఫీ చేయకుండా మొత్తం సంపూర్ణంగా రుణమాఫీ చేశామని చెబితే అది సంపూర్ణంగా దిగజారటమే అని మండిపడ్డారు. రుణమాఫీ పచ్చి మోసం, దగా అని, రైతులను మోసం చేసిన సీఎంపై చీటింగ్ కేసు పెట్టాలని పిలుపునిచ్చారు. ఇంత దిగజారుడు... దివాళా తీసిన ముఖ్యమంత్రిని ఎక్కడ చూడలేదన్నారు. రుణమాఫీ పేరిట దీన్ని శతాబ్దపు అతి పెద్ద జోక్ గా చేసేశారని ఎద్దేవా చేశారు. రూ.40 వేల కోట్లు ఒక్క సంవత్సరం నేను కడుపు కట్టుకుంటే ఎంత విషయమని రేవంత్ రెడ్డి అన్నారని, కానీ ఆ తర్వాత లెక్క మారి రూ. 31 వేల కోట్లకే రుణమాఫీ అని కేబినేట్ తీర్మానం చేసిందన్నారు. ఎన్నికలకు ముందు రైతులందరికీ రుణమాఫీ అని చెప్పి ఇప్పుడు కొందరికి మాత్రమే అని చెబుతున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులు తమకు రుణమాఫీ కాలేదని వాపోతున్నారని పేర్కొన్నారు. చాలా మందికి నిబంధనల పేరుతో కటింగ్‌లు పెట్టారని, సీఎం అంటే చీఫ్ మినిస్టర్ కాదు, కటింగ్ మాస్టర్ అన్నట్లుగా మారిపోయిందని అన్నారు. రూ.రెండు లక్షల రుణమాఫీ, రెండు లక్షల ఉద్యోగాలు, మహిళలకు రూ. 2,500, జాబ్ క్యాలెండర్, ఆటో అన్నలకు సాయం మోసం, వృద్ధులకు రూ. నాలుగు వేలు మోసం అంటూ విమర్శించారు. పెండింగ్ వడ్డీ కడితేనే రుణమాఫీ చేస్తామంటూ రైతులకు బ్యాంకర్లు నోటీసులు ఇచ్చారన్నారు. బడ్జెట్ లో రూ. 26 వేల కోట్లు అన్నారు, కేబినేట్ లో రూ.31వేల కోట్లు అని రుణమాఫీ కోసం చెప్పారు కానీ నిన్నటి వరకు అయింది రూ.17, 934 కోట్లు మాత్రమే... అదికూడా 22 లక్షల మంది రైతులకు మాత్రమే రుణమాఫీ జరిగిందన్నారు. వానాకాలానికి ఇవ్వాల్సిన రైతు భరోసాను ఎగ్గొట్టారు. యాసంగిలో కూడా రైతు భరోసా ఇవ్వలేదని ఆరోపించారు. రుణమాఫీ అయిందంటూ కొంతమంది చిల్లర గాళ్లు పోస్టర్లు పెట్టారని, హరీశ్‌రావు అడిగనట్లు అసలు రుణమాఫీ అయిందా అనే విషయం ముందు చెప్పాలన్నారు.

**రాహుల్ అందుకే రాలేదు**

ఇదేదో మోసమని భావించే రాహుల్ గాంధీ రుణమాఫీ సభకు రాలేదని కేటీఆర్ అన్నారు. హరీశ్‌రావు రాజీనామా చేయాలంటూ కాంగ్రెస్ నాయకులు రంకెలు వేస్తున్నారని, కానీ బీఆర్‌ఎస్ దీన్ని ఎండగడుతది, బీఆర్‌ఎస్ ఎటు పోదు, మీరు అలాంటి ఆశలు పెట్టుకోవద్దని సూచించారు. ప్రతి నియోజకవర్గాన్ని పరిశీలించి రైతుల కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. రుణమాఫీ మొత్తం చేయకపోతే అవసరమైతే కోర్టుకు కూడా పోతామని చెప్పారు. మహిళలపై యథాలాపంగా మాట్లాడిన మాటలకు క్షమాపణ చెప్పానని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డికి అదే సంస్కారం ఉంటే మహిళ శాసన సభ్యులను విమర్శించిన దానికి క్షమాపణ చెబుతారా అని నిలదీశారు. ఇతర రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలను అధ్యయనం చేసి కమిటీల్లో అవసరమైన మార్పులు చేస్తామన్నారు. కొడంగల్ లో ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటా అన్న సన్నాసి ఎవరని రేవంత్ రెడ్డిని ఉద్దేశించి అన్నారు. మాజీ మంత్రులు జగదీశ్ రెడ్డి, సత్యవతి రాథోడ్, శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

# నింగిలోకి ఎస్ఎస్ఎల్‌వీ- డి3

**విశాలాంధ్ర-సూళ్లూరుపేట:** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మరో ఘనత సాధించింది. ఎస్ఎస్ఎల్‌వీ-డీ3 ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించింది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోగల సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం (షార్) నుంచి ఈ రాకెట్‌ను ప్రయోగించింది. శు క్రవారం ఉదయం 9.17 గంటలకు నింగిలోకి దూసుకెళ్లిన రాకెట్... 175 కిలోల బరువున్న ఈవోఎస్-08 ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్ష్యకు చేర్చింది. ప్రయోగం 17 నిమిషాల పాటు సాగింది. ఈఓఎస్-08 ఉపగ్రహంతో పాటు ఎస్ఆర్ జీరో డెమోసాట్‌నూ నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. చిన్న ఉపగ్రహాల ప్రయోగ వాహనం (ఎస్ఎస్ఎల్‌వీ)-డి3 ద్వారా అంతరిక్షంలోకి చేరుకున్న ఈవోఎస్ ఉపగ్రహం ఏడాది పాటు సేవలు అందిస్తుంది.పర్యావరణం, ప్రకృతి విపత్తులు, అగ్ని పర్వతాలపై సమాచారాన్ని చేరవేస్తుంది. సముద్ర ఉపరితలం గాలులను విశ్లేషించడానికి, నేలలో తేమను అంచనా వేయడానికి, హిమాలయాలలోని క్రియోస్పియర్ అధ్యయనం కోసం ఉపయోగపడుతుంది. యూఆర్ రావు ఉపగ్రహ కేంద్రంలో ఈవోఎస్‌ను అభివృద్ధి చేశారు. ఇందులో ఉండే ఎలక్ట్రో ఆప్టికల్ ఇన్‌ఫ్రారెడ్ (ఈవోఐఆర్) పేలోడ్ మిడ్-వేవ్, లాంగ్ వేవ్ ఇన్‌ఫ్రా-రెడ్‌లో చిత్రాలను బంధిస్తుంది. విపత్తు నిర్వహణకు ఈ సమాచారం ఎంతగానో దోహదమవుతుందని ఇస్రో తెలిపింది. ప్రయోగం విజయవంతం కావడంపై హర్షం వ్యక్తంచేసింది. శాస్త్రవేత్తలను చైర్మన్ సోమనాథ్ అభినందించారు.

**డిసెంబరులో గగన్‌యాన్**

గగన్‌యాన్ మిషన్‌లో తొలి ప్రయోగాన్ని డిసెంబరులో చేపట్టబోతున్నట్లు ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ ప్రకటించారు. ఎస్ఎస్ఎల్‌వీ ప్రయోగం విజయవంతమైన తర్వాత ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతిష్ఠాత్మక గగన్‌యాన్ మిషన్ గురించి చెప్పారు. ప్రస్తుతం గగన్‌యాన్ తొలి మిషన్ (జీ1)పై పనిచేస్తున్నట్లు తెలిపారు. రాకెట్ దశల్లో ఎస్200, ఎల్1, సీ32 ఉంటాయని, ఇవన్నీ సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రంలో ఉన్నాయని చెప్పారు. వైరింగ్, టెస్టింగ్ పూర్తి చేయాల్సి ఉందన్నారు. నవంబరు నాటికి మొత్తం వ్యవస్థ (సిస్టమ్)ను సిద్ధం చేసుకొని, డిసెంబరులో ప్రయోగాన్ని చేపట్టాలని లక్ష్యం పెట్టుకున్నట్లు సోమనాథ్ చెప్పారు. వీఎస్ఎస్‌సీ తిరువేంద్రంలో క్రూ మాడ్యూల్ ఇంటిగ్రేషన్ జరుగుతోందని, క్రూ ఎస్కేప్ హార్డ్‌వేర్ సిద్ధమైందన్నారు. ఎస్ఎస్ఎల్‌వీ మిషన్ విజయంతో భూమి దిగువ కక్షలో ఉపగ్రహాలను చేర్చేందుకు ఇస్రోకు మార్కెట్ అవకాశాలు పెరిగాయని తెలిపారు. వాణిజ్య ఎస్ఎస్ఎల్‌వీ మిషన్లలో భాగస్వామ్యంపై పారిశ్రామిక ప్రతినిధులతో చర్చలు జరిపినట్లు వెల్లడించారు. ఇస్రో నుంచి సాంకేతికత బదిలీపై ఆసక్తిగల కంపెనీలను ఆహ్వానించేందుకు 'రిక్వెస్ట్ ఫర్ ఇంటరెస్ట్' (ఆర్‌పీఐఎఫ్)ను విడుదల చేశామన్నారు. రాకెట్ల నిర్మాణంలో శిక్షణ వంటి అంశాల్లో పారిశ్రామిక భాగస్వామ్యానికి ఇస్రో ప్రణాళికలు సిద్ధమౌతున్నట్లు చెప్పారు. ఆసక్తి కనబర్చే కంపెనీల సామర్థ్యాన్ని బట్టి వాటి ఎంపిక ఉంటుందని సోమనాథ్ వెల్లడించారు.

# 24 గంటల పాటు వైద్యసేవల నిలిపివేత

## ఐఎంఏ ఏపీ శాఖ పిలుపు

**అమరావతి :** కోల్‌కతా ఆర్‌జీ కర్ ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రిలో విధుల్లో ఉన్న మహిళా వైద్యురాలిపై అమానుషంగా, సామూహికంగా అత్యాచారం చేసి పాశవికంగా హత్య చేసిన కేసుపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఈనెల 17వ తేదీ నుంచి 24 గంటల పాటు ఇండియన్ మెడికల్ కౌన్సిల్ (ఐఎంఏ) వైద్య సేవల నిలిపివేతకు పిలుపునిచ్చింది. ఈ వైద్యురాలి మృతిపై నిరసనలు తెలుపుతున్న ఆర్‌జీ కర్ వైద్య కళాశాల ఆస్పత్రి విద్యార్థులపైన, వైద్యులపైన ఈనెల 14వ తేదీ రాత్రి రౌడీమూకల దాడులనూ ఐఎంఏ తప్పు పట్టింది. ఐఎంఏ-ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ ముర్రు జయచంద్ర నాయుడు, డాక్టర్ పోలవరపు ఫణీంద్ర శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ పిలుపులో భాగంగా శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు నగర, పట్టణంలోని అన్ని ప్రైవేట్ ఆస్పత్రుల్లో అత్యవసర సేవలను మినహాయించి, ఓపీడీ సేవలు, అత్యవసరం కాని శస్త్ర చికిత్సలను పూర్తి స్థాయిలో నిలిపివేస్తామని తెలిపారు. వైద్య విద్యార్థిని మృతి సంఘటనపై ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేసి, సీబీఐ అధ్వర్యంలో వేగవంతంగా విచారించాలని, నిందితులకు కఠిన శిక్షలు పడేలా చూడాలని డిమాండ్ చేశారు. ఆస్పత్రి విధుల్లో ఉన్న వైద్యులకు, వైద్య సిబ్బందికి తగిన రక్షణ కల్పించే వ్యవస్థను ఏర్పాటు చేయాలని, ప్రత్యేక రక్షణ చట్టాలను కేంద్ర స్థాయిలో తీసుకురావాలని, రాష్ట్రంలో ఉన్న వైద్య సిబ్బంది రక్షణ చట్టాన్ని సవరించి కఠినతరం చేయాలన్నారు. ఈ నిరసన తర్వాత ప్రభుత్వాలు తీసుకునే చర్యల ఆధారంగా కార్యాచరణ ఉంటుందని, తమ డిమాండ్లు సాధించేంత వరకు ఉద్యమం కొనసాగుతుందని ఐఎంఏ నేతలు తెలిపారు.

# నిరసన వెల్లువ

(మొదటిపేజీ తరువాయి)

సంఘీభావం తెలుపుతూ, కేంద్ర రక్షణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. మధ్య ప్రదేశ్‌లోని భోపాల్‌లోని గాంధీ వైద్య కళాశాల ఆస్పత్రి వద్ద వైద్యులు, వైద్య విద్యార్థులు నిరసన చేపట్టారు. డాక్టర్ సమీక్షా బేడీ మాట్లాడుతూ 'ఈ సంఘటన తర్వాత మేమంతా భయపడ్డాం. విశ్రాంతి తీసుకోవడానికి మాకు డ్యూటీ రూమ్‌లు ఉన్నప్పటికీ భద్రత ఆందోళనకరంగా ఉంది. ప్రతి అంతస్తులో గార్డులు ఉండాలి. ఇలాంటి సంఘటనలు మేము విధులు నిర్వహించడానికి సవాలుగా మారాయి' అని అన్నారు. తెలంగాణా రాష్ట్ర హైదరాబాద్‌లోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) వైద్యులు రాస్తారోకో నిర్వహించారు. గతంలో నల్లబ్యాడ్జీలు ధరించి తమ నిరసనను తెలియజేసిన నిమ్స్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ శు క్రవారం నుంచి విధుల బహిష్కరణ ప్రకటించింది. గాంధీ హాస్పిటల్, ఉస్మానియా ప్రభుత్వాస్పత్రి, నీలోఫర్ ఆస్పత్రిలోని తమ సహోద్యోగులతో కలిసి నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. మహారాష్ట్ర రాజధాని ముంబైలోని నాయర్ ఆస్పత్రిలో జూనియర్ వైద్యులు, వైద్య విద్యార్థులు ఆందోళనకు దిగారు. శుక్రవారం ముంబైలోని ఆజాద్ మైదాన్‌లో మహారాష్ట్ర అసోసియేషన్ ఆఫ్ రెసిడెంట్ డాక్టర్స్ (ఎంఏఆర్‌డీ) కూడా నిరసన ప్రకటించింది.

**నేడు 24 గంటల పాటు సేవలు నిలిపివేత : ఐఎంఏ**

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఆగస్టు 17న ఉదయం 6 గంటల నుంచి దేశవ్యాప్తంగా 24 గంటలపాటు అత్యవసర సేవలను ఉపసంహరించుకోనున్నట్లు ప్రకటించింది.

ఈ సమయంలో ఔట్ పేషెంట్ విభాగాలు (ఓపీడీలు), ఎంపిక చేసిన శస్త్ర చికిత్సలను నిలిపివేయనున్నారు. ఆధునిక వైద్య సేవలను అందించే అన్ని రంగాలపై ఈ ఉపసంహరణ ప్రభావం చూపుతుందని ఐఎంఏ పేర్కొంది. 'కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ వైద్య కళాశాల ఆస్పత్రిలో జరిగిన క్రూరమైన నేరం, స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా (బుధవారం రాత్రి) నిరసన తెలిపిన విద్యార్థులపై హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్న నేపథ్యంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధునిక వైద్య సేవలను దేశవ్యాప్త ఉపసం హరణను ప్రకటించింది. ఆగస్టు 17 శనివారం ఉదయం 6 గంట ల నుంచి 18వ తేదీ ఆదివారం ఉదయం 6 గంటల వరకు ఈ నిరసన కొనసాగుతుంది' అని ఆ ప్రకటన పేర్కొంది. 'వైద్యులు, ముఖ్యంగా మహిళలు, వృత్తి స్వభావం కారణంగా హింసకు గురవుతారు. ఆస్పత్రుల్లో, వాటి ఆవరణల్లో వైద్యుల భద్రతను నిర్ధారించడం అధికారుల బాధ్యత' అని తెలిపింది. ఐఎంఏ రాష్ట్ర శాఖలతో సంప్రదింపుల తర్వాత అత్యవసర వైద్య సేవలను దేశవ్యాప్తంగా ఉపసంహరించుకోవాలని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది.

# మళ్లీ ఎన్నికల హడావుడి

(మొదటిపేజీ తరువాయి)

సెప్టెంబర్ 18న జరుగుతుంది. ఇందుకోసం ఆగస్టు 20న నోటిఫికేషన్ విడుదలవుతుంది. 27వ తేదీతో నామినేషన్ల గడువు ముగుస్తుంది. 28న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. నామినేషన్ల ఉపసంహరణ గడువు ఆగస్టు 30వ తేదీతో ముగుస్తుంది. రెండో విడత పోలింగ్ సెప్టెంబర్ 25న జరుగుతుంది. ఇందుకోసం ఆగస్టు 29న నోటిఫికేషన్ విడుదలవుతుంది. సెప్టెంబర్ 5వ తేదీతో నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగుస్తుంది. సెప్టెంబర్ 6న నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. సెప్టెంబర్ 9వ తేదీతో నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగుస్తుంది. మూడవ విడత పోలింగ్ అక్టోబర్ 1న జరుగుతుంది. దీనితో పోలింగ్ ముగుస్తుంది. ఇందుకోసం సెప్టెంబర్ 5న నోటిఫికేషన్ వెలువడుతుంది. సెప్టెంబర్ 12వ తేదీతో నామినేషన్ల గడువు ముగుస్తుంది. 13న నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. 17వ తేదీతో నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగుస్తుంది. 90 అసెంబ్లీ స్థానాలకుగాను తొలివిడతలో 24 అసెంబ్లీ స్థానాలకు, రెండో విడతలో 26 అసెంబ్లీ స్థానాలకు, మూడో విడతలో 40 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ జరుగుతుంది. ఇక హర్యానా అసెంబ్లీ ఎన్నికల (2024) షెడ్యూల్ ప్రకారం మొత్తం 90 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో అక్టోబర్ 1న పోలింగ్ జరుగుతుంది. ఇందుకుగాను సెప్టెంబర్ 5న నోటిఫికేషన్ విడుదలవుతుంది. సెప్టెంబర్ 12వ తేదీతో నామినేషన్ల గడువు ముగుస్తుంది. సెప్టెంబర్ 13న నామినేషన్ల పరిశీలన, 16వ తేదీతో నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగుస్తుంది. అక్టోబర్ 1న పోలింగ్ జరుగనుండగా... అక్టోబర్ 4న కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు ప్రకటిస్తారు.

**మహారాష్ట్ర ఎన్నికలు తర్వాత నిర్వహిస్తాం: రాజీవ్‌కుమార్**

కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ తర్వాత ప్రకటిస్తామని తెలిపారు. దీనిపై రాజీవ్ కుమార్ మరింత వివరణ ఇస్తూ గత పర్యాయం మహారాష్ట్ర, హర్యానా అసెంబ్లీ ఎన్నికలను ఏకకాలంలో నిర్వహించామని, అప్పుడు జమ్మూకశ్మీర్ ఎన్నికల అంశం తెరపైకి రాలేదని అన్నారు. ఈ ఏడాది నాలుగు ఎన్నికలు ఉన్నాయని, ఇవి పూర్తయిన వెంటనే ఐదో రాష్ట్రానికి సంబంధించిన అసెంబ్లీకి ఎన్నికలు ఉంటాయని చెప్పారు. జమ్మూకశ్మీర్, హర్యానా, మహారాష్ట్ర, జార్ఖండ్, ఢిల్లీ ఎన్నికలు వరుసగా జరగాల్సి ఉన్నాయని చెప్పారు. భద్రతా బలగాలు అందుబాటులో ఉండే విషయాన్ని పరిగణనలోకి తీసుకుని... రెండేసి రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించినట్టు చెప్పారు. దీనికి తోడు మహారాష్ట్రలో వర్షాలు కురుస్తుండటంతో పాటు వరుసగా పండుగలు ఉండటం కూడా కారణాలని చెప్పారు.

# ఉత్తమ హీరో రిషబ్

(మొదటిపేజీ తరువాయి)

అవార్డులు ప్రకటించారు. ప్రాంతీయభాష విభాగంలో తెలుగు చిత్రం కార్తికేయ-2 ఉత్తమచిత్రంగా ఎంపికైంది.

**ఫీచర్ సినిమాలు:** ఉత్తమ చిత్రం: ఆట్టమ్ (మలయాళం), ఉత్తమ నటుడు: రిషబ్ శెట్టి (కాంతార - కన్నడ), ఉత్తమ నటి: నిత్య మీనన్ (తిరుచిత్రంబళం - తమిళం), మానసి పరేఖ్ (కచ్ ఎక్స్‌ప్రెస్ - గుజరాతీ), ఉత్తమ ప్రాంతీయ చిత్రం (తెలుగు): కార్తికేయ-2, ఉత్తమ ప్రాంతీయ చిత్రం (కన్నడ): కేజీయఫ్ -2, ఉత్తమ ప్రాంతీయ చిత్రం (తమిళం): పొన్నియిన్ సెల్వన్ - 1, ఉత్తమ దర్శకుడు: సూరజ్ బర్జాత్యా (ఉంచాయి - హిందీ), బెస్ట్ ఫిల్మ్ ప్రమోటింగ్ నేషన్, సోషల్, ఎన్విరాన్‌మెంటల్ వాల్యూస్: కచ్ ఎక్స్‌ప్రెస్ (గుజరాతీ), ఉత్తమ హోల్‌సమ్ ఎంటర్‌టైన్మెంట్: కాంతార (కన్నడ), ఉత్తమ విజువల్ ఎఫెక్ట్స్: బ్రహ్మాస్త్ర - పార్ట్ 1: శివ (హిందీ), ఉత్తమ దర్శకుడు (డెబ్యూ): ప్రమోద్ కుమార్, ఫౌజా (హరియాన్వీ), ఉత్తమ సహాయ నటి: నీనా గుప్తా (ఉంచాయి- హిందీ), ఉత్తమ సహాయ నటుడు: పవన్ రాజ్ మల్హోత్రా (ఫౌజా - హరియాన్వి), ఉత్తమ సినిమాటోగ్రఫీ: పొన్నియిన్ సెల్వన్: పార్ట్ - 1 (తమిళం), సినిమాటోగ్రాఫర్: రవి వర్మన్, బెస్ట్ ఫిమేల్ ప్లే బ్యాక్ సింగర్ : బాంబే జయశ్రీ (చాయుమ్ వెయిల్), సినిమా: 'సౌదీ వెల్లక్క సీసీ 225/2009', ఉత్తమ ప్లే బ్యాక్ సింగర్ : అర్జిత్ సింగ్ (కేసరియా) - బ్రహ్మాస్త్ర పార్ట్ -1: శివ (హిందీ), ఉత్తమ బాల నటుడు: శ్రీపాథ్ (మలికాపురమ్ - మలయాళం), ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్: నిక్కి జోషి (కచ్ ఎక్స్‌ప్రెస్-గుజరాతీ), ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్ : ఆనంద అద్య (అపరాజితో), ఉత్తమ ఎడిటింగ్: ఆట్టమ్, ఎడిటర్: మహేష్ భువనేండ్, ఉత్తమ సౌండ్ డిజైన్: పొన్నియిన్ సెల్వన్ - 1 (తమిళం), డిజైనర్: ఆనంద్ కృష్ణమూర్తి, ఉత్తమ స్క్రీన్‌ప్లే (ఒరిజినల్): ఆట్టం - ఆనంద్ ఏకార్షి, ఉత్తమ మాటల రచయిత: అర్పితా ముఖర్జీ, రాహుల్ వి చిట్టెల (గుల్‌మోహర్), ఉత్తమ యాక్షన్ డైరెక్షన్: అన్బరివు (కేజీయఫ్ 2), ఉత్తమ కొరియోగ్రఫీ: జానీ మాస్టర్, సతీష్ కృష్ణన్ మాస్టర్ (తిరుచిత్రంబళం - తమిళ్), ఉత్తమ లిరిక్స్: ఫౌజా (హరియాన్వీ), రచయిత: నౌషద్ సదర్ ఖాన్, ఉత్తమ సంగీతం (పాటలు): బ్రహ్మాస్త్ర-పార్ట్ 1: శివ (హిందీ) - ప్రీతమ్, ఉత్తమ సంగీతం (నేపథ్యం): పొన్నియిన్ సెల్వన్ - 1 (తమిళ్), సంగీత దర్శకుడు: ఏఆర్ రెహమాన్, బెస్ట్ మేకప్ ఆర్టిస్ట్: సోమనాథ్ కుందు, (అపరాజితో - బెంగాలీ), ఉత్తమ ప్రాంతీయ చిత్రం (ఒడియా): దమన్, ఉత్తమ ప్రాంతీయ చిత్రం (మలయాళం): సౌది వెళ్లక్క సీసీ 225/2009, ఉత్తమ ప్రాంతీయ చిత్రం (మరాఠీ): వాళ్వీ (ది టెర్మైట్) , ఉత్తమ ప్రాంతీయ చిత్రం (హిందీ) : గుల్‌మోహర్, ఉత్తమ ప్రాంతీయ చిత్రం (బెంగాలీ): కబేరి అంతర్ధాన్, ఉత్తమ ప్రాంతీయ చిత్రం (పంజాబీ): బాగీ డి దీ, బెస్ట్ టివా ఫిల్మ్: సికాసిల్, స్పెషల్ మెన్షన్: గుల్‌మోహర్ (హిందీ), నటుడు: మనోజ్ బాజ్‌పాయ్‌బీ కదికన్ (మలయాళం), సంగీత దర్శకుడు: సంజోయ్ సలీల్ చౌదురి.

# ఎమ్మెల్సీగా బొత్స ఏకగ్రీవం

**బ్యూరో-విశాఖపట్నం :** ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఖాళీ అయిన ఎమ్మెల్సీ స్థానిక సంస్థల కోటా స్థానానికి వైసీపీ అభ్యర్థిగా బరిలోకి దిగిన మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బొత్సకు రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ధ్రువీకరణ పత్రం అందజేశారు. ఏపీ సార్వత్రిక ఎన్నికల తర్వాత జరిగిన తొలి ఎన్నిక కావడంతో ఈ స్థానాన్ని వైసీపీ ఏకగ్రీవంగా గెలవడంతో ఆ పార్టీ శ్రేణులు ఆనందంలో మునిగితేలు తున్నాయి. ఎన్నికల ప్రక్రియలో భాగంగా బుధవారం రిటర్నింగ్ అధికారి, విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ సమక్షంలో నామినేషన్ల పరిశీలన జరిగింది. స్వతంత్ర అభ్యర్థి షేక్ షఫీ, వైసీపీ అభ్యర్థి బొత్స సత్యనారాయణ తరపున ఆయన ప్రతినిధులు హాజరయ్యారు. అన్ని పత్రాలు ఉండడంతో రెండు నామినేషన్లు సక్రమంగా ఉన్నట్టు రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. నామినేషన్ల ఉపసంహరణకు ఈనెల 16వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల వరకు గడువు ఉంది. స్వతంత్ర అభ్యర్థి షేక్ షఫీ తాను నామినేషన్ ఉపసంహరిం చుకున్నట్టు బుధవారమే పత్రాలు దాఖలు చేశారు. దీంతో వైసీపీ అభ్యర్థి బొత్స సత్యనారాయణ ఒక్కరే బరిలో ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. అయినప్పటికీ ఎన్నికల షెడ్యూల్ ప్రకారం 16వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల తరువాతే అధికారికంగా బొత్స ఎన్నికయినట్లు ప్రకటించాల్సి ఉండటంతో శుక్రవారం సాయంత్రం అధికారిక ప్రకటన చేశారు. ఎన్నిక ఏకగ్రీవం కావడంతో శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటల తరువాత ఎన్నికల కోడ్ తొలగిపోయినట్లు రిటర్నింగ్ అధికారి మయూర్ అశోక్ వెల్లడించారు. ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండాలని కూటమి పార్టీలు నిర్ణయించుకున్న సంగతి తెలిసిందే. దీంతో వైసీపీ అభ్యర్థి బొత్స ఎన్నిక ఏకగ్రీవం అయింది. ఎమ్మెల్సీగా ఎన్నికయిన అనంతరం కలెక్టరేట్ ఆవరణలో బొత్స మీడియాతో మాట్లాడుతూ మంచి రోజు ఎమ్మెల్సీగా ఎన్నిక కావడం సంతోషంగా ఉందన్నారు. తనకు బీఫాం ఇచ్చిన వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తన విజయానికి సహకరించిన నాయకులకు, కార్యకర్తలకు, ఏకగ్రీవంగా ఎన్నికయ్యేందుకు సహకరించిన అన్ని రాజకీయ పార్టీలకు ధన్యవాదాలు తెలిపారు. వైసీపీ సొంత బలం ఉండడంతోనే తమ స్థానం తమకు దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు గొల్ల బాబురావు, విశాఖ నగర మేయర్ హరి వెంకట కుమారి, జడ్పీ చైర్ పర్సన్ జె.సుభద్ర, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్, మాజీ ఎమ్మెల్యేలు కన్నబాబురాజు, అదీప్ రాజు, తిప్పల నాగిరెడ్డి, కరణం ధర్మశ్రీ, కుంభా రవిబాబు, డిప్యూటీ మేయర్లు శ్రీధర్, సతీష్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు బొత్సను అభినందించారు.

# పెట్టుబడులు పెట్టండి

(మొదటిపేజీ తరువాయి)

సాధ్యమైనంత త్వరలోనే హైదరాబాద్ ను సందర్శిస్తానని తెలిపారు. పారిశ్రామిక, సేవల రంగాలతో పాటు అన్ని విభాగాల్లో విస్తరించే సత్తా హైదరాబాద్ నగరానికి ఉందని అన్నారు. త్వరలో చీఫ్ క్యాంపస్ ఆపరేషన్స్ ఆఫీసర్ క్యాథీ యాంగ్, సంస్థ భారత దేశ ప్రతినిధి వీ లీ బృందం హైదరాబాద్ వస్తుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి (ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్) జయేష్ రంజన్, ప్రత్యేక కార్యదర్శి డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి (ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ అండ్ ఎక్స్‌టర్నల్ ఎంగేజ్‌మెంట్), ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్స్ అండ్ ఎనర్జీ స్టోరేజ్ డాక్టర్ ఎస్కే శర్మ, ఫాక్స్‌కాన్ సంస్థ ఎస్బీజీ ప్రెసిడెంట్ బాబ్ చెన్, సీబీజీ జీఎం జో వూ, చీఫ్ క్యాంపస్ ఆపరేషన్స్ ఆఫీసర్ క్యాథీ యాంగ్, సీఎస్‌బీజీ డిప్యూటీ జీఎం సూ, షో కూ, సీ-గ్రూప్ మేనేజర్ సైమన్ సంగ్, సంస్థ భారత దేశ ప్రతినిధి వీ లీ పాల్గొన్నారు.

# 16 మంది ఐపీఎస్‌ల మూకుమ్మడి సెలవు

**- అమరావతి:** రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత బదిలీ అయి... పోస్టింగ్‌లు లేకుండా వెయిటింగ్‌లో ఉన్న ఐపీఎస్ అధికారులు వరుసగా సెలవులకు దరఖాస్తు చేసుకున్నారు. వైసీపీ ప్రభుత్వానికి అంటకాగారన్న అభియోగాల నేపథ్యంలో కొంతమంది సీనియర్ ఐపీఎస్ అధికారులను చంద్రబాబు ప్రభుత్వం బదిలీ చేసీ...డీజీపీ కార్యాలయానికి ఆటాచ్ చేసింది. వెయిటింగ్‌లో ఉన్న 16 మంది ఐపీఎస్ అధికారులు రోజూ ఉదయం పది గంటలకు డీజీపీ కార్యాలయానికి వెళ్లి అక్కడ హాజరు పట్టీలో సంతకాలు చేయాలని, పని గంటలు ముగిసే వరకూ కార్యాలయంలోనే ఉండి సాయంత్రం సంతకం చేసిన తర్వాతనే బయటకు వెళ్లాలని ఇటీవల డీజీపీ ద్వారకా తిరుమలరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో వారంతా మూకుమ్మడిగా సెలవు పెట్టారు. వెయిటింగ్‌లో ఐపీఎస్ అధికార్లు పీఎస్ఆర్ ఆంజనేయులు, పీవీ సునీల్ కుమార్, సంజయ్, కాంతి రాణా, పాలరాజు, కొల్లి రఘురామరెడ్డి, అమ్మిరెడ్డి, సీహెచ్ విజయరావు, విశాల్ గున్నీ, అన్బురాజన్, వై.రవిశంకర్ రెడ్డి, రిషాంత్ రెడ్డి, రఘువీరారెడ్డి, పరమేశ్వరరెడ్డి, జాషువా, కృష్ణకాంత్ పటేల్ ఉన్నారు.

## రాబియా పార్థివదేహానికి నివాళులు అర్పించిన ఖమ్మం ఎంపీ, సత్తుపల్లి ఎమ్మెల్యే



కల్లూరు ఆగస్టు 16 ( ప్రజావేదిక న్యూస్)

కల్లూరు పట్టణం - ప్రముఖ తెలంగాణ గ్రామర్ స్కూల్ చైర్మన్ హేట్రో జాన్మియా మాతృమూర్తి రాబియా పార్ధివదేహానికి నివాళులు అర్పించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసిన ఖమ్మం జిల్లా ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి , సత్తుపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ , రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ మరియు రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, కల్లూరు, పెనుబల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ భాగం ప్రభాకర్ చౌదరి ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా, యూత్ కాంగ్రెస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఆరు గ్యారంటీల లో రెండు లక్షల రుణమాఫీ హర్షనీయం - రిటైర్డ్ హెచ్ ఎం కీసర



కల్లూరు ఆగస్టు 16 (ప్రజా వేదిక న్యూస్):

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా తలపెట్టిన 6 గ్యారంటీల లో రైతు రుణమాఫీ రెండు లక్షల రూపాయలు ఎంతో హర్షనీయమని రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు కీసరి మోహన్ రెడ్డి అన్నారు. పేరువంచ గ్రామపంచాయతీ లో వైరా లో జరిగిన మహాసభకు సత్తుపల్లి శాసనసభ్యులు శ్రీమతి డాక్టర్ మట్ట రాగమయి దయానంద్ పిలుపుమేరకు పేరువంచ గ్రామము నుండి రైతులు, మహిళలు, యువకులు 800 మంది సీఎం మహాసభకు ప్రైవేటు బస్సులలోనూ ఆటోలలోనూ వారి ద్విచక్ర వాహనాల ర్యాలీలతోనూ ఐక్యతకు నిలయంగా సభకు వెళ్లటం ఎంతో అభినందనీయమని ఎమ్మెల్యే అభివృద్ధి బాటలు వేసేందుకు ప్రణాళికలలో భాగంగా అభివృద్ధికి సహకరిస్తూ, తయారుచేసి ముందస్తుగానే నిధులు మంజూరు చేసి అభివృద్ధికి ఎనలేని కృషిచేసిన ఎమ్మెల్యే రాగమయి దయానంద్ కి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు పరిమి భరత్, పప్పుల లక్ష్మీనారాయణ,కీసరి నిర్మల, గోపాలరావు, ఉబ్బన అశోక్, ఉబ్బన సుధాకర్, పరకాల రత్నాకర్, ముల్లపాటి నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించాలి




తిరుమలాయపాలెం. ఆగస్టు 16 ( ప్రజా వేదిక న్యూస్ )

విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించాలని గుదిమల్ల పాఠశాల ఉపాధ్యాయులు ధరావత్ రాములు తెలిపారు శుక్రవారం తిరుమలాయపాలెం ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి, తిరుమలాయపాలెం గ్రామ నివాసి, ఖమ్మం రూరల్ మండలములని ఎం పి పి ఎస్ గుది మళ్ళ పాఠశాలలో సెకండరో గ్రేడ్ ఉపాధ్యాయుడుగా పని చేయుచున్న ధరావత్ రాములు (రామన్న) వారి నాన్న జ్ఞాపకారము గత సం౹౹ పదో తరగతిలో అత్యధిక జి పి ఏ సాధించిన విద్యార్థినిలకు నగదు రూపంలో మరియు షీక్షలను బహుమతిగా ప్రదానం చేయుట జరిగింది. క్రీ.శే. ధరావత్. గోలియా జ్ఞాపకారముగా మొదటి బవలె మతి రూ? 6116/-లుం షీల్డు బదావల్. భవ్యశ్రీ %ణ/శీ% జైయితుకు రెండో బహుమతి రూ౹౹ 4116/-లుం షీల్డు మద్దినేని సాయి చరణ్య %ణ/శీ% వెంకట్రూప్రలకు ప్రదానం చేయడం జరిగింది. ఈ సందర్భముగా ధరావత్. రాములు మాట్లాడుతూ ప్రతి సం? ఈ ఉన్నత పాఠశాలలో అత్యధిక జి పి ఏ సాధించిన విద్యార్థినిబీ విద్యార్థులకు బహుమతులు ఇవ్వడం జరుగుతుందని తెలిపిన్నారు. -ఈ సందర్భముగా ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి . విజయకుమారి మరియు పాఠశాల ఉపాధ్యాయలు రాములు కి ప్రత్యేకమైన శుభాకాంక్షలు తెలిపిన్నారు. ఈ కార్యక్రమములో రాములు తల్లి జానకి వారి కుమారుల ధరావత్. యశ్వంత్ కృష్ణబీ ధరావత్ వంశీకృష్ణలు పాల్గోన్నారు.




## కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని ఆగస్టు 22 చలో హైదరాబాద్ పోదాం. సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పిలుపు.

తిరుమలాయపాలెం ఆగస్టు 16 ( ప్రజా వేదిక న్యూస్ ):

ఈ దేశంలో మనిషి బతకాలంటే తినడానికి తిండి, ఉండడానికి ఇల్లు, కట్టుకోవడానికి బట్ట లు కావాలి. కానీ ఈ అన్నింటికీ ఆధారం ఒక్కటే అది రేషన్ కార్డు. ఆ రేషన్ కార్డు లేకపోతే ఉండడానికి ఇల్లు రాదు. తినడానికి తిండి రాదు ఈ అన్ని కావాలంటే ఆగస్టు 22 చలో హైదరాబాద్ పోదామని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పాలేరు డివిజన్ కార్యదర్శి బందెల వెంకయ్య అన్నారు. శుక్రవారం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు అమరుడు రాయల వెంకట నారాయణ భవనం పిండిప్రోలు గ్రామంలో జరిగిన మండల ముఖ్య కార్యకర్తల జనరల్ బాడీ మండల నాయకుడు తుపాకుల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బందెల వెంకయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తో పాటు ఏడో గ్యారంటీగా ప్రజాస్వామ్య పరిరక్షణ గ్యారెంటీ కూడా అమలు చేయాలని అన్నారు. ఈ రాష్ట్రంలో ప్రజల సమస్యలు తీరాలంటే ప్రజా పోరాటాల మార్గమని పోరాటాలు చేయనిదే ఏదైనా సాధించలేమని అన్నారు ఆగస్టు 24 న హైదరాబాదు ఆర్టీసీ క్రాస్ రోడ్ నుండి ఇందిరా పార్క్ వరకు జరిగే ప్రదర్శన ధర్నాను ప్రజలు జయప్రదం చేయాలని కోరారు .

ఈ సందర్భంగా గోడ పోస్టర్ ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఖమ్మం జిల్లా నాయకులు కమ్మకోమటి నాగేశ్వరరావు, తిమ్మిడి హనుమంతరావు, మండల కార్యదర్శి సోమనపల్లి వెంకటేశ్వర్లు, డివిజన్ నాయకులు పులిగుజ్జు వెంకటస్వామి, ఎడ్లపల్లి నవీన్, బానోతు శంకర్, గొడుగు విజయ్, గోకినపల్లి



సరోజిని, కలపాల జయమ్మ, నామ అప్పారావు, ఆరెంపల వెంకన్న, పుసులూరి పుల్లయ్య, మీగడ సత్యం, తదితరులు పాల్గొన్నారు

## డ్రై డే ఫ్రైడే కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమీషనర్ ఆర్.వి. కర్ణన్...






ఖమ్మం ఆగస్టు 16 ప్రజావేదిక న్యూస్

శుక్రవారం కమీషనర్, కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తో కలిసి అధికారులతో సీజనల్ వ్యాధులు, డెంగ్యూ నియంత్రణ, వైద్య ఆరోగ్య శాఖ కార్యకలాపాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమీషనర్ మాట్లాడుతూ, జిల్లాలోని పలు ప్రాంతాల్లో పట్టణ ప్రాంతాలతోపాటు, గ్రామీణ ప్రాంతాల్లోను డెంగ్యూ కేసులు నమోదు అవుతున్నాయని, డెంగ్యూ నియంత్రణ పై వైద్య ఆరోగ్య శాఖతోపాటు స్థానిక సంస్థలు చర్యలు తీసుకోవాలని అన్నారు. డ్రై డే కార్యక్రమాల వల్ల దోమల వృద్ధిని అరికట్ట వచ్చున్నారు. పరీక్షలు పెంచాలని, పాజిటివ్ వచ్చినచో, సంబంధికులు, చుట్టుప్రక్కల నమూనాలు సేకరించడం, నియంత్రణ చర్యలు చేపట్టడం చేయాలన్నారు. ఫీవర్ సర్వే రెగ్యులర్ గా చేయాలన్నారు. సంబంధిత శాఖల అధికారులతో బృందాలను ఏర్పాటుచేసి, గ్రామాల్లో, వార్డుల్లో ఇంటింటికి తిరగడం, ప్రజల్లో అవగాహన కల్పించడం చేయాలన్నారు. నీరు నిల్వ లేకుండా చూడడం, యాంటీ లార్వా ఆపరేషన్ చేపట్టడం చేయాలన్నారు. వచ్చే 2-3 నెలలు అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా ప్రధాన ఆసుపత్రిలో డెంగ్యూ తో బాధపడేవారికి ఒక ప్రత్యేక వార్డు ఏర్పాటుచేసి, చికిత్స అందించాలన్నారు. వార్డులో 24 గంటలు వైద్యాధికారి అందుబాటులో ఉండి, ప్రత్యేక శ్రద్ధ తీసుకొనేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో సేకరించే నమూనాలు టి హబ్ కు, ప్రయివేట్ ఆసుపత్రుల నమూనాలు ఐడిఎస్పి ల్యాబ్ లకు పరీక్షలు చేయించాలని అన్నారు. ప్లేట్లెట్ కౌంట్ పై ప్రజల్లో భయం పోగొట్టి తగు చికిత్స అందించాలని అన్నారు. ప్లేట్లెట్, బ్లడ్ సరిపోవునంతగా అందుబాటులో ఉండేట్లు చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామాల్లో శానిటేషన్ పై దృష్టి పెట్టాలని ఆయన తెలిపారు. కావాల్సిన మందులకు ఇండిట్ పంపాలన్నారు. మంజూరు పోస్టులు భర్తీ చేయాలన్నారు.

అంతకుముందు కమీషనర్ కూసుమంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో రెఫరల్, అంబులెన్స్, డెలివరీ రిజిష్టర్లను తనిఖీ చేశారు. ఇడిడి లు వివరాలు అడిగి, రెగ్యులర్ గా పర్యవేక్షణ చేస్తున్నది అడిగారు. ల్యాబరేటరీ పరీక్షల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయుష్ ఓపి రోజువారి ఎంతమంది వస్తున్నది అడిగి తెలుసుకున్నారు. డెలివరీలు పెంచాలని, గర్భిణులకు రెగ్యులర్ చెకప్ అయ్యేలా చూడాలని, మెరుగైన సేవలు అందించి నమ్మకం పెంచాలని అన్నారు. వైద్య శిబిరాలు ఏర్పాటుచేయాలని, సీజనల్ వ్యాధుల నియంత్రణకై పారిశుద్ధ్యం, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించాలని అన్నారు.

జిల్లా ప్రధాన ఆసుపత్రిని వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమీషనర్ జిల్లా కలెక్టర్ తో కలిసి తనిఖీ చేశారు. రేడియాలజీ కేంద్రాన్ని పరిశీలించి, ఎంతమంది టెక్నీషియన్లు ఉన్నది, ఎన్ని పరీక్షలు చేపడుతున్నది అడిగి తెలుసుకున్నారు. మామోగ్రఫి చేపడుతున్నది, ఎన్ని కేసులు చేసింది అడిగారు. పరీక్షల రిజిష్టర్ పరిశీలించారు. టీ హబ్ కేంద్రాన్ని పరిశీలించారు. డెంగ్యూ పరీక్షల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుండి రోజువారి వస్తున్న పరీక్షల శాంపిల్స్, ఏ ఏ పరీక్షలకు ఎక్కువగా శాంపిల్స్ వస్తున్నది, టి హబ్



లో ఎన్ని రకాల పరీక్షలు చేపడుతున్నది, ఎంత వ్యవధిలో పరీక్షా ఫలితాలు అందజేస్తున్నది వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అనంతరం దానవాయిగూడెం లో క్షేత్ర స్థాయిలో పర్యటించి డ్రై డే కార్యాచరణ చేపట్టారు. ఇంటింటికి వెళ్లి, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటిస్తూ, దోమలు వృద్ధి చెందకుండా చూసుకోవాలని, నీటి నిల్వలో దోమలు వృద్ధి చెందుతాయని, నీటి నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులు రాకుండా స్థానిక సంస్థలు చర్యలు చేపట్టాలని, వ్యాధులు వచ్చిన చోట వెంటనే చికిత్స అందించి, వ్యాపించకుండా వైద్య, ఆరోగ్య శాఖ చర్యలు తీసుకోవాలని కమీషనర్ అన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, ప్రతి శుక్రవారం జిల్లాలో డ్రై డే ను పటిష్టంగా చేపడుతున్నట్లు తెలిపారు. స్లమ్ ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టడం, వైద్య శిబిరాలు నిర్వహించడం చేయాలన్నారు. ప్రజల్లో సీజనల్ వ్యాధులపై అవగాహనకు విస్తృత ప్రచారం చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య, శిక్షణ సహాయ కలెక్టర్ మిర్నల్ శ్రేష్ఠ, ఇంచార్జ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, డిఆర్డీవో సన్యాసయ్య, జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి డా. మాలతి, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. రాజేశ్వర రావు, డిసిహెచ్ఎస్ డా. రాజశేఖర్, డిటీసీఓ డా. సుబ్బారావు, ఇంచార్జ్ జెడ్పి సిఇఓ నాగలక్ష్మి, డిప్యూటీ డిఎంహెచ్ఓ డా. సైదులు, డా. సీతారాం, ప్రోగ్రామ్ అధికారులు డా. చందు నాయక్, డా. రామకృష్ణ, మెడికల్ సూపరింటెండెంట్ డా. కిరణ్ కుమార్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డా. కిరణ్ కుమార్, ఆర్ఎంఓ డా. రాంబాబు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికస్వావలంభన సాధించాలి.

నేలకొండపల్లి ఆగస్టు 16 ప్రజా వేదిక న్యూస్

మహిళలు ఆర్థిక స్వాలంభన సాధించాలని నేలకొండపల్లి ఎంపీడీఓ యం.యర్రయ్య సూచించారు. మండలం లోని మోటాపురం లో ఇందిరా మహిళా శక్తి పథకం పీఎంఎఫ్యం ద్వారా రూ.1.80 లక్షలతో ఏర్పాటు చేసిన పిండి, కారం, అల్లం, వెల్లుల్లి పేస్ట్ యంత్రం ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...తెలంగాణ ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా నిలిపేందుకు అనేక రకాల యూనిట్ల ను స్థాపిస్తున్నట్లు తెలిపారు. స్వశక్తి తో సమాజంలో నిలబడేలా ఆర్థిక సహాయం ను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రధాన మంత్రి ఫార్మలైజేషన్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ప్రైజెస్ పథకం ద్వారా మహిళలకు వివిధ . రకాల యూనిట్ల ను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో. ఐకేపీ ఏపీఎం ఆశోక్ణి, నిర్వహకురాలు షేక్ రేష్మ, సీసీ లు గ్రామ దీపికలు, గ్రామ




సమాఖ్య అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు..

సంపాదకీయం

# వృద్ధికి ప్రకృతి విపత్తుల ఆటంకం

దేశాభివృద్ధికి వైపరీత్యాలు పెద్ద ఆటంకంగా ఉన్నాయి. అదే సమయంలో మనిషి కలిగించే విపత్తులు కూడా వృద్ధిని అడ్డుకుంటాయి. ముఖ్యంగా విద్య, వైద్యరంగాలు అభివృద్ధికి ఎంతో కీలకమైనవి. అలాగే నిరుద్యోగం, పేదరికం, ఆరోగ్యం, విద్య రంగాలు ప్రైవేటురంగం చేతుల్లోకి వెళ్లిసామాన్య ప్రజలకు అందుబాటులో లేకుండా పోయాయి. ప్రకృతి పూర్తిగా కలుషితమై కలిగించే కోవిడ్–19 లాంటి మహమ్మారులు లక్షలాదిమంది మృత్యువాత పడటమేగాక, కోట్లాది మంది జీవనం తల్లకిందులవుతుంది. వీటిపట్ల ప్రభుత్వాలు శ్రద్ధ వహించకుండా, కార్పొరేట్ల అనుకూల విధనాలు అమలు చేసినట్లయితే వృద్ధి గురించి అంకెల్లో చూపించి సంబరపడటమే అవుతుంది గానీ, ప్రజల బతుకులలో వృద్ధి కనిపించదు. ప్రకృతి వైపరీత్యాల వల్ల వేలాదిమంది మరణించడమేగాక, లక్షలాది మంది జీవితాలు తల్లకిందులైపోతాయి. ప్రకృతి వైపరీత్యాలలో కొండ ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడి, ఒక్కసారిగా బురదతో కూడిన వరవదలవల్ల గ్రామాలకు గ్రామాలే మునిగిపోయి అంతుచిక్కని నష్టం కలుగుతుంది. తాజా విపత్తుకు కేరళలోని వయనాడ్‌లో జరిగిన విపత్తు ఉదాహరణ. విపత్తులు సంభవించినప్పుడు బాధితులను ఆదుకోవడంకంటే రాజకీయ వైషమ్యాలు ప్రజలను మరిన్ని కష్టాలపాలు చేస్తున్నాయి. పంటలు దెబ్బతింటాయి. విద్య, వైద్యరంగాల సేవలు అందడం కష్టమవుతుంది. ఈ విపత్తులు ఎక్కడ సంభవించినా ప్రజలకు అపారనష్టం జరుగుతుంది. ఇదే సమయంలో ప్రభుత్వాలు చేపట్టిన మౌలిక సదుపాయాల కల్పన, వివిధ ప్రాజెక్టులకు అంతరాయం కలిగే అవకాశం ఉంటుంది. ఈ విపత్తుల పట్లపజల్లో చైతన్యం కల్పించడం ఎంతో అవసరం. అలాగే ప్రభుత్వాలు ఏర్పాటుచేసే ప్రకృతి వైపరీత్యాలవల్ల కలిగే రిస్క్‌ను తగ్గించడానికి ఏర్పాటుచేసిన యంత్రాంగం సకాలంలో రంగప్రవేశంచేసి సహాయ కార్యక్రమాలు చేపట్టాలి. మానవ వనరులతోపాటు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం మూలంగా ప్రయోజనం ఎక్కువగా ఉంటుంది.

వయనాడ్‌లో బాధితులను, మృతులను వేగంగా గుర్తించడానికి డ్రోన్లను ఉపయోగించారు. లోయల్లో, పర్వతప్రాంతాల్లో విపత్తులు జరిగినప్పుడు డ్రోన్లు బాగా ఉపయోగపడతాయి. భూకంపాలు, ఉప్పెన్లు, తీవ్ర తుపాన్లు, సునామీ వంటి ప్రకృతి వైపరీత్యాలపట్ల ప్రజలకు అవగాహన కల్పించాలి. అలాగే ఈ ప్రాంతాల్లో సహాయకార్యక్రమాలు చేపట్టడానికి అవసరమైన నిపుణులైన యంత్రాంగాన్ని, అవసరమైన పరికరాలను, యంత్ర సామగ్రిని సిద్ధం చేయాలి. ప్రకృతి వైపరీత్యాల సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేయాలి. అలాగాకుండా ప్రతిపక్ష రాష్ట్రాల పట్ల తీవ్ర వివక్ష చూపినట్లయితే, పౌరులందరినీ సమంగా చూడాలన్న రాజ్యాంగంలో పొందు పరచిన ఆదేశిక సూత్రాలను ఉల్లంఘించినట్లే అవుతుంది. ఇవేవీ అనుసరించకుండా, ఆచరించకుండా అత్యంత వేగంగా దేశాన్ని ప్రపంచంలో ఆర్థికంగా 5వ స్థానంలో నిలుపుతామని, ఇది మాతోనే సాధ్యమవుతుందని గొప్పలు చెప్పుకున్నా ప్రయోజనం ఉండదు. ఒకవైపు బ్యాంకులు ఆర్థికంగా సంక్షోభంలో ఉన్నాయని రిజర్వు బ్యాంకు వెల్లడించిన గణాంకాలే స్పష్టం చేస్తున్నాయి. సామాన్యప్రజల జీవన ప్రమాణాలుపెరగకుండా గణాంకాలు చూపితే ప్రయోజనం ఉండదు.

1977 నవంబరులో ఆంధ్రప్రదేశ్ దివిసీమలో ఉప్పెన సంభవించి 30వేల మంది చనిపోవడమే గాక అనేక పదులు గ్రామాలు అంతులేకుండా పోయాయి. పొలాలు ఇసుకమయమై నేటికీ పంటలు పండకుండా తయారయ్యాయి. ఆనాడు వేలాదిమంది మరణించడమేకాక లక్షలాది మంది బతుకులు ఛిద్రమయ్యాయి. 1999లో ఒడిశాలో సూపర్ తుపాను సంభవించి 30వేల మంది ప్రాణాలు కోల్పోయారు. ఇంకా వేలు, లక్షల మంది జీవితాలు అతలాకుతలమయ్యాయి.ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చుచేసి బాధితులకు ఉపశమనం కలిగిస్తాయి. 2001 కచ్ ప్రాంతంలో భూకంపం సంభవించి ఊహించలేనంత నష్టం కలిగించింది. అలాగే 2004లో హిందు మహాసముద్రంలో సునామీ సంభవించింది. ఉత్తరాఖండ్, అరుణాచల ప్రదేశ్, ఇతర ఈశాన్య రాష్ట్రాలలో ప్రతి ఏటా ప్రకృతి బీభత్సాలు జరిగి ఊహించలేనంతగా నష్టం కలిగిస్తుంది. ఈ నేపథ్యంలో 2005లో జాతీయవిపత్తుల నిర్వహణ చట్టం రూపొందించారు. దీని కింద జాతీయ విధ్వంస నిర్వహణ సంస్థ పనిచేస్తుంది. ఇది విపత్తు నిర్వహణ బాధ్యతను తీసుకుంటుంది. ప్రకృతి విపత్తులు సంభవిస్తాయని ముందుగా నిర్ధారించే సమయంలో అన్ని యంత్ర పరికరాలతో సిద్ధంగా ఉండాలి. ఆయా సమయాల్లో, ఆయా ప్రాంతాల్లో పనిచేసే యంత్రాంగం అప్రమత్తం కావడమేగాక, ప్రజలను చైతన్యపరిచి సురక్షిత ప్రాంతాలకు తరలించడం తదితర సహాయ కార్యక్రమాలకు సిద్ధపడాలి. అయితే ఈ విషయంలో పాలకులు ముందుగానే సిద్ధపడే సందర్భాలు తక్కువగానే ఉంటున్నాయి. ప్రజలు నిత్య జీవితంలో తలమునకలై ఉండి తగు జాగ్రత్తలు తీసుకోలేకపోవడం ఉంటుంది. ప్రజలను చైతన్యపరిచేందుకు జాతీయ స్కూలు రక్షణ కార్యక్రమం కింద 22 రాష్ట్రాలలో 43 జిల్లాల పరిధిలో 8600 స్కూళ్లను ఏర్పాటు చేశారు. అయితే ఇవి ఎంత సమర్థంగా పని చేస్తున్నాయని చెప్పడం కష్టం. వాతావరణంలో అపారమైన మార్పులు వచ్చాయి. జీవావరణం అంతా కలుషితమైంది. నీరు, గాలి, భూమి తదితర సర్వ వ్యవస్థలూ కలుషితం కావడం, రోజు రోజుకీ భూతాపం పెరిగిపోతున్నందున ప్రకృతి వైపరీత్యాలు పెరిగిపోతున్నాయి. వీటి పట్ల ఇప్పటికైనా జీవన విధానంలో సమూల మార్పులు జరగకపోతే మానవాళి మనుగడే ప్రమాదంలో పడుతుందని వాతావరణ శాస్త్రవేత్తలు పదేపదే హెచ్చరిస్తున్నారు. ప్రపంచ దేశాలన్నీ వేగంగా, క్రియాశీలంగా పనిచేయాలని ఐక్యరాజ్యసమితి విజ్ఞప్తి చేస్తోంది. విధ్వంసక అభివృద్ధి జరిగినా అది అంతగా ప్రయోజనం కలిగించదు.

# జ్వర పీడితులమా...! డబ్బు పీడితులమా...!

వొళ్లంతా సలసల కాగుతూండగా మంచంపై మగతగా నిద్రిస్తూ కంటిముందు అస్పష్టంగా... లీలగా కదలాడే దృశ్యాలను కవిత్వం చేశావా ఎప్పుడైనా...!? కాలి బొటనవేలు నుంచి సమస్త శరీరమంతా ఓ గుప్పిట్లా మారి... "వొళ్లు పిడికిలవుతోందిరా" అన్న కవి మాటలు ఏనాడైనా జ్ఞప్తికి వచ్చాయా...!? చూడకూడని, వినకూడని వార్త వింటే "రక్తం మరిగిపోతోంది నాకు" అని అనుకుంటావు కాని, ఆ ప్లేట్‌లెట్స్ ఆవిరైపోయి.... నీకు తెలియకుండానే నీ ఒంట్లోనే కరిగిపోతాయని తెలిసి తొలిసారి విన్న ఆ రక్త కణాల లెక్కలు మధ్యతరగతి జీవితాల్లాగే ఎగుడుదిగుళ్ల మాయాజాలమని కనిపెట్టావా....!?

డాక్టర్ సాంబ పరిచయమేనా.... అదేదో సినిమాలో చిరంజీవికి ఫొటో తీస్తే పాము పడినట్లు ఈ డాక్టర్ సాంబకి ఫొటో తీస్తే 5 అడుగుల 11 అంగుళాల నిలువెత్తు జలగల గుంపు పడుతుందని నీకెవ్వరైనా చెప్పరా...!? డాక్టర్ సాంబ ఏకవచనం కాదు... ఒక్క కోనసీమలోనే అతని పుట్టుకా కాదు. అనేకానేక పేర్లతో సర్వనామంగా వెలుగొందుతున్న మనుషుల రక్తాన్ని పీల్చే "రక్త పింజరి ఈ డాక్టర్ సాంబ"... అతని ఉరఫ్‌లు. రక్తంలో ప్లేట్‌లెట్స్ కాదురా తగ్గేది... మనిషిలో మానవత్వపు ఆనవాళ్లు ఆవిరైపోతున్న దృశ్యంరా ఇది. కాళ్లు, చేతులు నిప్పుల నొప్పులతో నీకు అనుభవంలో లేని, నువ్వు వినని ఓ కొత్త శత్రువు నీ శరీరంలోకి ప్రవేశించిందని తెలిసాక ఓ భయానక

చక్రవాకం
- ముక్కాముల చక్రధర్

వాతావరణం ఎలా ఉంటుందో ఎప్పుడైనా అనుభవించావా.. పోనీ కనీసం కలగన్నావా... !? ఇదిగో, ఈ మధ్యనే నేను అనుభవించాను. శారీరక బాధ సరే, శరీరంపై పొడిచే ప్రతీ ఇండీషన్ పోటుకి డబ్బుల కాయలు కాయించడం నేను చూశాను. నువ్వు బతికుండడం నీకు, నీ వాళ్లకి చాలా ముఖ్యం. కానీ, అదిగో, మెడలో నాగుపాము వంటి స్టెతస్కోప్ వేసుకున్నాడు చూడు. ఆ సాంబ... అతగాడికి నువ్వు బతికుండడం మరీ ముఖ్యం... కాదు... కాదు... అతని బ్యాంకు బ్యాలెన్సుకి అవసరం. రోజులు గడపాలి. గడిపేస్తూ బతికించాలి. బిల్లుల బల్లలు మారాలి. బల్లల బిల్లులు చకచకా పరుగులు పెట్టాలి. జ్వరం తగ్గకూడదు. తగ్గిందనిపించాలి. వైకుంఠపాళి నిచ్చెనలో ప్లేట్‌లెట్స్ పెరుగుతున్నట్లుగా భ్రాంతి కలిగించాలి. మళ్లీ ఆ పక్కనే ఉన్న చిన్న పాము నోట్లో పడి అమాంతం కిందకి పడిపోయినట్లుగా వాస్తవాన్ని కళ్ల ముందుంచాలి. ఇదంతా వైద్య విద్య కాదు. విద్యలాంటి భ్రాంతి. "ఆ బాబు జేబులో ఏముందో చెప్పు" అంటూ గారడీ వాడడిగినప్పుడు ఠక్కున "మనీపర్సు" అని సమాధానం వచ్చేలా చేసే విద్య. ఐదేళ్ల వైద్య విద్యలో ఇది నేర్పరు. ఆ తర్వాత మూడేళ్ల పీజీలోనూ బోధించరు. డాక్టర్‌గా బోర్డు తగిలించుకోగానే ఎవరికి వారు నేర్చుకోవాల్సిన రోగ విద్య. వైద్యం కాదు సుమా... డబ్బు విద్య. రోగ విద్య. వైద్యులందరికీ రాదు. నేర్చుకునేందుకు కూడా అవకాశం ఇవ్వని విద్య. కొందరికే ఇది పరిమితం. కార్పొరేట్ల నుంచి దిగుమతి చేసుకుని అలా అలా కళ్లముందు పెరుగుతున్న అంతస్తుల్లాంటి పీడించే విద్య.

నువ్వు రోజుల తరబడి ఓ భ్రమలో నిరీక్షించేలా చేయడమే ఈ విద్య. అతగాడి... ఆ స్టెతస్కోప్ వంటి నాగుపామును మెడలో ధరించిన ఆ కనిపించే రక్త పింజరికి నువ్వు నిరీక్షించడం కావాలి. ప్రతి పల్లెలోనూ ఇదే దృశ్యం. ప్రతి పట్టణంలోనూ ఇదే పల్లవి. ప్రతి నగర నరనరంలోనూ ఇదే.. అదే ఒకే ఒక్క దృశ్యం. గొప్ప కవి అజంతా సరే, నాకు కూడా "కంటక చతురాస్రాల మధ్య నిరీక్షణ అసహ్యం". కానీ, ఏం చేస్తాం. నిరీక్షించాల్సిందే. చూపుల కంటే ఎదురు చూపులే తియ్యన. జీవితం కదా... ఎదురు చూపుల నిరీక్షణ ఫలిస్తుందని తెలియాలి కదా. అలాంటప్పుడే... ఇదిగో జీవితమంటే బొమ్మే కాదురా బాబూ... బొరుసూ ఉంటుందని చెప్పేందుకు కొందరుంటారు. వాళ్లూ వైద్యులే. నీకు నీ జీవితం మీద, నీ బతుకు మీద... నీ ప్రాణం మీద ఆశలు సన్నగిల్లినప్పుడు వాళ్లు తారసపడతారు. నీ జీవితంలో మిగిలిన వెలుగులు నీకు చూపించేందుకు ముందుకు వస్తారు. "అబ్బే ఏం కాలేదు. ఇదీ చాలా సాధారణం. ఈ మందులు వేసుకుని, ఇవి తినండి. అన్నట్లు అవి తినకండి. వారం రోజులే. మీ జీవితం మీరు జీవించవచ్చు. మీ కవిత్వం మీరు రాసుకోవచ్చు" అంటూ బతుకుమీద ఆశ పుట్టిస్తారు. ఈ డాక్టర్ల దగ్గరున్న వైకుంఠపాళిలో నీ బతుకు నిచ్చెనలే ఉంటాయి. కాటేసే పాములు ఇక్కడ నిషేధం. అవునూ... వీళ్లని ఏమంటాం మనం. ఇంకేమంటాం..."కళ్ల ముందు కదలాడే దేవుళ్లు అంటాం... అవును... వీళ్లే దేవుళ్లంటే... "

(మంచి మనసున్న డాక్టర్లు కాళ్లకూరి శైలజ, ప్రియాంకలకు నమస్కరిస్తూ...)

సీనియర్ జర్నలిస్టు, సెల్: 9912019929

# అహంకారం తలకెక్కితే...

రాజేంద్ర రాజన్

గురువారం స్వాతంత్ర్య దినోత్సవం రోజున దిల్లీలోని ఎర్రకోట ఎందుకో కళ తప్పినట్టు కనిపించింది. ప్రధానమంత్రి తాను కట్టుకున్న తల పాగాను పదే పదే నిమురుతున్నారు. ఆయన ప్రసంగం నిస్సారంగా మాత్రమే కాదు, అసహ్యకరంగా కూడా ఉంది. దేశానికి సందేశం ఇవ్వవలసిన సందర్భంలో రెచ్చగొట్టే మాటలు మాట్లాడారు. ఆయన మాటల్లో దిగజారుడుతనం కొట్టొచ్చినట్టుగా ఉంది.

**ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అధికార మర్యాదల ప్రకారం కేంద్ర మంత్రులు కూర్చునే మొదటి వరసలో ఏడో స్థానంలో కూర్చోవాలి. కానీ ఆయనను వెనక్కు నెట్టి అయిదో వరసలో కూర్చోబెట్టారు. అదేమంటే ముందు వరసలో ఇటీవల ఒలింపిక్స్ పోటీల్లో పతకాలు సాధించిన వారిని కూర్చోబెట్టాం అన్నారు. వారిని గౌరవించవద్దని ఎవరూ అనరు. కానీ దానికోసం ప్రతిపక్ష నాయకుడిని అవమానించనక్కర్లేదు.**

ప్రభుత్వ ప్రవర్తనవల్ల రాహుల్‌కు పోయిందేమీ లేదు. ఆయన హీరోగానే మిగిలారు. కాని ప్రభుత్వమే విమర్శలు ఎదుర్కోవలసి వచ్చింది. మోదీ ప్రసంగంలో గాంధీ, నెహ్రూ, సుభాష్ చంద్రబోస్ లాంటి వారి పేర్లను చిలకపలుకుల్లా పలికారు తప్ప అందులో వారి మీద గౌరవభావం ఏ మాత్రంలేదు.

మోదీకి, అమిత్ షాకు మర్యాదలేదు. ఈ విషయంలో వారిద్దరూ ఒకటే. వారికి నైతికతా లేదు. వివేకమూ శూన్యమే. ఇది సాంస్కృతిక దిగుజారుడుతనానికి ప్రతీక అనుకోవాలా? అదేననిపిస్తోంది. సాహిత్య, సాంస్కృతిక రంగాలలో ఇలాంటి వారే వీర విహారం చేస్తున్నారు. మోదీ, షా కూడా ఈ రంగాల వారిని కలుసుకుంటున్నారు. ఇంతకు ముందు ఆ ఊసే ఉండేది కాదు. సాహిత్య, సాంస్కృతిక రంగాలు వారికి నిషేధిత అంశాలుగా ఉండేవి.

అందుకే ప్రేమ్‌చంద్ చాలా సాహసంగా సాహిత్యం కన్నా రాజకీయంగా చాలా ముందుంటుంది అనగలిగారు. మా బోటి రచయితలు ప్రేమ్‌చంద్, నిరాలా, పర్సాయ్ లాంటి వారి తలుచుకుంటూ ఉంటాం. ఇలాంటి వారి గురించి కార్ల్ మార్క్స్ చక్కగా ప్రసిద్ధ కవి డ్రైడెన్ చెప్పిన కవితా పంక్తులను ఉదహరించి వివరించారు. "సన్యాసి బాణం, నక్క మేధస్సును చంపేస్తాయి. సత్యం, మతానికి క్రమశిక్షణ ఉండాలి. అసత్యం చెప్పేవారి తలకాయలు నెమలి పింఛంలా సదా విచ్చుకుని పరుచుకుని ఉంటాయి. దేశంలోనే కాదు నేను ఉండే బీహార్‌లో కూడా ప్రేమ్‌చంద్, నిరాలా లాంటి వారు ఎవరైనా కనిపిస్తారా అని అన్వేషిస్తుంటాను. ఎప్పుడూ నిరాశే మిగులుతుంది. అలాంటి సంప్రదాయాన్ని నిలబెట్టిన వారి గురించి ఆలోచిస్తే ఎక్కడ చూసినా అహంకారులు, మోసకారులు మాత్రమే తారసపడ్తుంటారు. కానీ గతంలోకి తొంగిచూస్తే కాస్త ధైర్యం కూడగట్టుకున్నట్టు ఉంటుంది. వారు నిజాయితీపరులు, సాహసికులు. వారు మార్పు కోసం త్యాగం చేయడానికి దేన్నయినా త్యజించగలరు.

ప్రేమ్‌చంద్ 56 వ ఏటనే మరణించారు. అప్పుడు నిరాలాకు



ఆరేళ్లు. అప్పుడే నిరాలా తరచుగా ప్రేంచంద్ దగ్గరకు వెళ్తూ ఉండేవారు. ప్రేమ్‌చంద్ కు ఏం మిగిలింది అనుకునేవారు. ఆయనకు మిగిలిందల్లా తిరస్కారం, అవమానం, విమర్శ, పేదరికం మాత్రమే. కానీ ఆయన సాహిత్య రంగానికి, సమాజానికి అమూల్యమైన నిధి మిగిల్చి వెళ్లారు. హిందీ సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు.

ప్రేమ్‌చంద్ కు అప్పటికి గొప్ప బహుమానమైన మంగలా ప్రసాద్ అవార్డయినా దక్కలేదు.

**నిజానికి ప్రేమ్‌చంద్‌కు ఏ అవార్డూ రాలేదు. ఆయనను అభినందిస్తూ కనీసం ఓ ఉత్తరం ముక్కైనా రాసిన వారు లేరు. హిందీ సాహిత్య సమ్మేళన్ అయినా ఆయనకు అవార్డు ఇవ్వలేదు. నేనూ అదే దారిలో నడుస్తాను అని నిరాలా అనే వారు. వారికి గౌరవం, అవార్డులు దక్కని మాట నిజమే. నిరాలా సుమారుగా ప్రేమ్‌చంద్ స్థాయికి ఎదిగారు. కళ్లతోనే వారిద్దరూ ఒకరినొకరు గౌరవించుకునే వారు. పర్సాయ్ కూడా ప్రేమ్‌చంద్ లాంటి రచయితే. ఆయనకూ నిరాశే మిగిలిది. అయినా "మేం సంతృప్తిగా, ఆనందంగా జీవిస్తాం. వాస్తవాన్ని మాయచేస్తేనే జీవించాలన్న లాలస తీరుతుంది. నేను మాట్లాడేది ఒకటి, రాసేది మరొకటి, చేసేది ఇంకొకటి. మా దృష్టిలో మనసు వేరు కర్మ వేరు. మార్కెట్‌లో మాకు ధర పలకాలి. మేం సర్వాంతర్యాములం." అని నిరాలా రాశారు.**

**(అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి)**

# అర్ధరాత్రి వేళ బెంగాల్ మహిళల నిరసన



అర్ధరాత్రివేళ, వేలాదిమంది మహిళలు పశ్చిమ బెంగాల్ వీధులను తమ ధిక్కార వేదికగా మార్చుకున్నారు. చాలా కాలంగా అణచివేతలకు గురైన మహిళల ఆగ్రహం పెల్లుబికింది. రాష్ట్రవ్యాప్తంగా నిరసనల దావానలం రేగింది. కోల్‌కతా ఆసుపత్రిలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య చేసిన దుర్మార్గంపై రాష్ట్ర ప్రజలు తీవ్ర ఆవేశం, ఆవేదన వెలిబుచ్చారు. ఉక్కిరిబిక్కిరి అవుతున్న కోపం, నిరాశ విస్ఫోటనం చెందాయి. ఆగష్టు 14–15, 2024న రాత్రిని భద్రత, స్వేచ్ఛా దినంగా పశ్చిమ బెంగాల్ మహిళలు పిలుపునిచ్చారు. "మాకు న్యాయం కావాలి" అని అరుస్తూ వేలాది మంది నిరసనకారులు నగరాల్లోని ప్రధాన జంక్షన్‌లను అడ్డుకున్నారు. వీరిలో ప్రధానంగా పిల్లలు, యువకులు, మధ్య వయస్కులు, సీనియర్ సిటిజన్లు ఉన్నారు. తల్లిదండ్రులు తమ కుమార్తెలను రాత్రిపూట బయటకు వెళ్లమని ప్రోత్సహించిన రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనకు దిగారు. "ప్రభుత్వం, వ్యవస్థలు నేరస్థులను పెద్ద ఎత్తున రక్షిస్తున్నాయి. ఆధారాలు కనుమరుగయ్యేలా చేస్తున్నారు. ఇది నేరస్థులను రక్షించడానికి ఉద్దేశపూర్వక ప్రయత్నం, పౌరులను కాదు" అని కాలేజీ విద్యార్థి ఒయినిద్రిలా మోండల్ పేర్కొన్నారు, "పౌరులను రక్షించండి, నేరస్థులను కాదు" అని చేతితో రాసిన పోస్టర్‌ను పట్టుకుని నిరసన విద్యార్థులు పెద్ద ఎత్తున తెలిపారు.

"నా కూతురు హాస్టల్‌లో ఉంటోంది. అత్యాచారంచేసి చంపిన డాక్టర్ కూడా నా కూతురే. ఆమెకు జరిగినది మన ఆడపిల్లల్లో ఎవరికైనా జరిగి ఉండవచ్చు. అది జరగడానికి ఎలా అనుమతించగలను?" అని న్యూ టౌన్‌లోని బిస్వా బంగ్లా గేట్ వద్ద నిరసనకు హాజరైన కస్తూరి గోస్వామి ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా మహిళలు, విద్యార్థినులు ఎదుర్కొంటున్న అణచివేతలకు వ్యతిరేకంగా బెంగాల్‌లో రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. దిన్‌హటాలో స్థానిక తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) నాయకుడు ఉదయన్ గుహా 'రీక్లెయిమ్ ది నైట్' ర్యాలీలో పాల్గొన్న మహిళలను బెదిరించడం అక్కడి వాతావరణాన్ని మరింత ఆగ్రహానికి గురిచేసింది. వందలాది మంది మహిళలు అతని బెదిరింపులను ధిక్కరించి వీధుల్లోకి వచ్చారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ కేంద్రాల వరకు, మహిళల ఆగ్రహజ్వాలలు వ్యాపించాయి. ఉత్తర 24 పరగణాస్‌లోని బాగా నుంచి కూచ్ బెహార్‌లోని మెఖ్లిగంజ్ వరకు, పురూలియాలోని గ్రామాల నుంచి జాదవ్‌పూం, లేక్ టౌన్‌లోఉన్న వీధుల వరకు మహిళలు ఒక్కటిగా ఉద్యమించారు. కొన్ని చోట్ల పురుషులు కూడా వారి పక్షాన నిలిచారు. లేక్ టౌన్ బిగ్ బెన్ సమీపంలో సమావేశంలో చేరిన సీనియర్ సిటిజన్ శంపా మోయిత్రా "వి వాంట్ జస్టిస్" అంటూ నినదించారు. తాను ఏ రాజకీయ పార్టీతో పొత్తు పెట్టుకోలేదని, అయితే శ్రామిక మహిళల భద్రత పట్ల జరిగిన ఘాతుకానికి తీవ్ర ఆందోళనలో ఉన్నానని మొయిత్రా అన్నారు. యువ వైద్యురాలిపై అత్యాచారం, హత్యపై మొదట మౌనం వహించిన టిఎంసి ఎంపీలు ఒక గంట వ్యవధిలో, సంఘటనను ఖండిస్తూ మంచి డ్రాఫ్ట్ సందేశాలను పోస్ట్ చేయడం ప్రారంభించారు.

# ఓడితే అల్లకల్లోలమేనంటున్న ట్రంప్

టి.వి.సుబ్బయ్య

డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలాహారిస్ అమెరికా అధ్యక్ష పదవికి పోటీ చేయడానికి నిర్ణయించుకుని బరిలోకి దిగిననాటి నుంచి అమెరికాలో ప్రజాదరణ పెరుగుతూనే ఉంది. ప్రస్తుత అధ్యక్షుడు బైడెన్ అనారోగ్య కారణాలు, పార్టీలో ఆయన తప్పుకోవాలని కోరడంవల్ల ఆయన పోటీ నుంచి తప్పుకున్నారు. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బరిలో ఉన్నందున బైడెన్ అయితే ఓడిపోతాడని అంచనా ఉంది. దీంతో కమలాహారిస్ అధ్యక్ష పదవికి పోటీ చేయాలని నిర్ణయించుకుని ఆలస్యంగా ప్రచారంలోకి దిగినప్పటి నుంచి ట్రంప్ ఆందోళనకు గురవుతున్నారని ప్రముఖ పత్రికలు (న్యూయార్క్ టైమ్స్ లాంటివి) రాశాయి. కమలాహారిస్ ప్రచారంలోకి దిగిన రెండు, మూడు రోజుల్లో జరిగిన మూడు, నాలుగు సర్వేలలో ఆమె ట్రంప్ కంటే ఎక్కువ ఆధిక్యంలో ఉందని వెల్లడైంది. ఒక సర్వేలో మాత్రమే ఒక శాతం ట్రంప్ ఆధిక్యంలో ఉన్నట్లు తెలిపింది. ట్రంప్ మీద హత్యాయత్నం జరిగిన తర్వాత ఆయన గెలుపు ఖాయమన్న అంచనాలు వచ్చాయి. కమలా హారిస్‌కు ఆదరణ పెరుగుతున్నప్పటి నుంచి ట్రంప్ రంకెలేస్తున్నాడు. ఇటీవల కమల డెట్రాయిట్‌లో ఏర్పాటుచేసిన బహిరంగసభకు భారీగా జనం హాజరయ్యారు. సభ ప్రారంభమయ్యేటప్పుడు పలస్తీనా అనుకూల నిరసనకారులు కమలాకు వ్యతిరేకంగా నినాదాలుచేసి అంతరాయం కలిగించారు. అప్పుడు కమలా, ట్రంప్‌ను గెలిపించాలనుకంటే ఆ విషయం స్పష్టం చేయండి, నేను మాట్లాడను, నన్ను బలపరుస్తామంటే నేను మాట్లాడతాను అని అన్నారు. హాజరైన వారంతా కమలాకు అనుకూలంగా పెద్దపెట్టున నినదించారు. ఉపాధ్యక్షుడిగా పోటీ చేయడానికి కమలా మిన్నెసోట గవర్నరు టిమ్‌వాల్జ్‌ను ఎంపిక చేసుకున్నారు. ఆయన ఫుట్‌బాల్ కోచ్‌గా, ఉపాధ్యాయుడిగా, అమెరికా రిజర్వు సైనిక విభాగం జాతీయ గార్డుగా పనిచేశారు. మంచి చమత్కారంగా మాట్లాడి ప్రజలను ఆకట్టుకుంటున్నారు. వాల్జ్‌ను ఎంపికచేసుకుని కమల మంచిపని చేశారని మీడియా మెచ్చుకుంటున్నది. ట్రంప్‌ను, రిపబ్లికన్ పార్టీని విమర్శించడానికి ఎంతో చాకచక్యంగా మాట్లాడుతూ, ఆదరణ పొందుతున్నారు. ఆయన అనుచరులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. వాల్జ్‌ను ఎంపికచేసిన తర్వాత నుంచి కమల సభలకు భారీగా జనం వస్తున్నారు. కమల, బైడెన్ కలిసి కొన్నిచోట్ల ప్రచారం చేయాలని నిర్ణయించారు. ఆమెకు వస్తున్న ఆదరణను చూసి తాను ఓడిపోతే దేశంలో కల్లోల పరిస్థితులు ఏర్పడతాయని, ప్రపంచంలో యుద్ధాలు పెరుగుతాయని ట్రంప్ మాట్లాడుతున్నాడు. కమలకు సిలికాన్ వ్యాలీలోని టెక్ దిగ్గజాలతోపాటు దాదాపు 700 కంపెనీల యజమానులు మద్దతు తెలియజేస్తూ ప్రదర్శన జరిపారు. ప్రచారం కోసం కమలకు తక్కువకాలంలోనే కొన్ని వందల డాలర్ల విరాళాలు వచ్చాయి. కమల సభలకంటే తన సభలకే అనేక రెట్లు ఎక్కువ వస్తున్నారని అయితే పత్రికలు రాయడంలేదని అంటున్నారు. ట్రంప్‌కంటే కమల సమర్థంగా పరిపాలిస్తారని ఇప్పుడు ఎక్కువమంది అభిప్రాయపడుతున్నారు. సైన్యంలో పనిచేయని వారినే ఎన్ను కుంటారని అనేకమంది ప్రముఖులు అంటున్నారు. ఆఫ్రికన్ అయిన ఒబామాను రెండుసార్లు ఎన్నుకున్నారని, ట్రంప్ విమర్శలను తిప్పికొడుతున్నారు. మాజీ అధ్యక్షుడు ఒబామా దంపతులు కమలాహారిస్‌కు మద్దతు తెలిపారు. కమల సభలకు వచ్చే జనం వాస్తవంకాదని కృత్రిమ మేధ ద్వారా ఎక్కువ జనం ఉన్నట్లు కనిపిస్తున్నారని, ఆమెను పోటీనుంచి తప్పించాలని ట్రంప్ అనడంతో జనం భారీగా సభ నుంచి వెళ్లిపోయారు. డెట్రాయిట్‌లో ఈ సంఘటన జరిగింది.

మూడు రాష్ట్రాల్లో కమల ఆధిక్యత

కమలాహారిస్ దేశవ్యాప్తంగా ట్రంప్ కంటే ఆధిక్యకంగా ఉన్నారని అనేక సర్వేలు తెలియజేస్తున్నాయి. కమలకు 48శాతం ఓట్లు వస్తాయని న్యూయార్క్ టైమ్స్ తన అంచనాను గత శుక్రవారం ప్రకటించింది. ఇదే పత్రిక ట్రంప్‌ను కుంగదీసే వార్తను వెలువ రించింది. కమల మూడు కీలకమైన రాష్ట్రాలలో ఆధిక్యతలో ఉన్నారు. మిచిగాన్, పెన్సిల్వేనియా, విస్కాన్సిన్‌లలో 50 లేదా 49 శాతం ఓట్లతో ఆధిక్యతలో ఉన్నారని న్యూయార్క్ టైమ్స్ సర్వే తెలిపింది. ఇది ట్రంప్‌ను కచ్చితంగా బెంబేలెత్తిస్తున్న అంశం. మార్జిన్‌లో 2, 3 శాతం తేడా ఉండవచ్చునని ఆ పత్రిక తెలిపింది. ఈ నేపథ్యంలో కమల ఆధిక్యతలో దూసుకు పోతున్నారని అనేక సర్వేలు గత శుక్రవారం వెల్లడించాయి. ట్రంప్ స్వీయ విధ్వంస ప్రచారమే. కమలను ఒక ప్రైవేటు సమావేశంలో బిచ్ (వేశ్య)అని తిట్టారనేది సోషల్



మీడియాలో వైరల్ అయింది. దేశమంతటా తన వెనుకుందని 75శాతం ఓటర్లు తనకే ఓటు వేస్తారని ట్రంప్ ప్రచారం చేస్తున్నారు. అన్ని సర్వేలు తాను గెలుస్తానని చెపుతున్నాయని ప్రచారంలో అంటున్నారు. ట్రంప్ ప్రచారం బోలుమాటల బెదిరింపులతో సాగుతోందని మీడియా వ్యాఖ్యానిస్తున్నది. ఏ మాత్రం హుందాతనం లేదు.

భారతదేశంలో మోదీ ప్రచారంలోనూ, తాను దైవదూత అని ప్రచారం చేసుకున్న విషయం తెలిసిందే. ట్రంప్ ప్రచారం అలా ఉంది. నాలుగేళ్లక్రితం అధ్యక్షఎన్నికల పోటీలో డెమొక్రటిక్ అభ్యర్థి జో బైడెన్ గెలిచినప్పుడు కూడా శ్వేతభవనాన్ని ఆక్రమించుకుని నానా గందరగోళం చేశారు. ట్రంప్ వ్యతిరేకులు, భద్రతాదళాలు, డెమొక్రటిక్ పార్టీ కార్యకర్తలు శ్వేతసౌధాన్ని చుట్టుముట్టినప్పుడు భయంతో భవనం లోపల రహస్య ప్రదేశంలో దాక్కున్నాడు. ప్రజలకు ఉచిత తాయిలాలు, ఇతర వాగ్దానాలను కమల కూడా తన పుస్తకాలు దొంగిలించి, వాటినే ప్రచారం చేసుకుంటున్నారని ట్రంప్ ఆరోపిస్తున్నారు. ఏడు రాష్ట్రాల్లో ఎవరికి ఓట్లు ఎక్కువవస్తే వాళ్లు గెలుస్తారని ట్రంప్‌కు అనుకూలమైన ఫాక్స్ న్యూస్ ప్రకటించింది. వాటిలో మూడు రాష్ట్రాల్లో కమల ఇప్పటికే ఆధిక్యతలో ఉన్నట్లుగా న్యూయార్క్ టైమ్స్ ప్రకటించింది. 'బిఐ ఫ్యాన్స్' సర్వే 42–40 శాతం తేడాతో కమల ఆధిక్యతలో ఉందని తెలియచేసింది. కార్మికులకు కనీస వేతనం పెంచుతామని ఇద్దరూ ప్రచారం చేస్తున్నారు. సీనియర్ పౌరులకు ఇచ్చే సామాజిక భద్రతా ప్రయోజనాలమీద వేసే పన్ను హోటళ్లు లాంటి చోట్ల యిచ్చే టిప్స్ మీద పన్నువేయబోమని ఇద్దరు అభ్యర్థులూ వాగ్దానం చేస్తున్నారు. కమల హారిస్ కొంత ప్రగతిశీల భావాలు కలిగిన వనిత అని, ఆమె గెలిస్తే విదేశాంగ విధానంలోనూ, దేశంలోనూ కొన్ని మార్పులు జరగవచ్చునన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఆమె వామపక్ష భావాలతో దేశాన్ని నాశనం చేస్తుందని ట్రంప్‌చేసే ప్రచారాన్ని కమలాహారిస్ సభలన్నింటిలోనూ ప్రజలు తిప్పికొడుతున్నారు. ఈసారి కమలా హారిస్ గెలుస్తారని అత్యధికులు భావన.